ప్రజాశక్తి
శుక్రవారం 8 డిసెంబర్ 2023 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

నేడు సిఎం పర్యటన ఇలా..

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించడానికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం జిల్లాకు వస్తున్నారు. శుక్రవారం ఉదయం తాడేపల్లి నుంచి ముందుగా తిరుపతి ప్రాంత పర్యటనకు వెళుతున్న ముఖ్యమంత్రి మధ్యాహ్నం ఒంటి గంటకు బాపట్ల సమీపంలోని మరుప్రోలువారిపాలెం వద్ద జాతీయ రహదారి 216పై ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్దకు వస్తారు. ప్రజాప్రతినిధులను కలిసి.. అక్కడ తుపానుకు దెబ్బతిన్న నష్టాలకు సంబంధించి ఫొటో ప్రదర్శనను పరిశీలిస్తారు. అనంతరం 1.40కి రోడ్డు మార్గంలో కర్లపాలెం మండలం పాతనందాయపాలెం వెళతారు. అక్కడ దెబ్బతిన్న మిరప పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడతారు. అక్కడి నుంచి 2.35 గంటలకు బుద్దాం గ్రామం వెళతారు. తుపానుకు దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తారు. అక్కడ పంటలు నష్టపోయిన రైతులతో ముఖాముఖిగా మాట్లాడతారు. అనంతరం 3.30కి జాతీయ రహదారి 216పై ఉన్న హెలీప్యాడ్ వద్దకు వచ్చి తాడేపల్లి బయలుదేరి వెళతారు.

నేడు, రేపు చంద్రబాబు పర్యటన

వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిశీలన ▲ 8లో



అపార నష్టం..

- తుపాను కారణంగా బాపట్ల జిల్లాలో 2,79,570 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- 1,86,170 ఎకరాల్లో వరిపైరుకు నష్టం
- కోలుకోలేని దెబ్బతిన్న రైతులు
- నేడు వేర్వేరుగా పంటలను పరిశీలించనున్న సిఎం జగన్, టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

తుపాను కారణంగా బాపట్ల జిల్లా రైతులు అపారంగా నష్టపోయారు. ముఖ్యంగా బాపట్ల జిల్లాలో లక్షల ఎకరాల్లో వరి పైరు వరదనీటిలో మునిగిపోయింది. మెట్ల పైర్లు కూడా దెబ్బతిన్నాయి. మొన్నటివరకు నీరు అందక పంటను నష్టపోయిన రైతులకు నేడు పంట చేతికి వచ్చే దశలో వచ్చిన తుపాను కారణంగా కోలుకోలేని దెబ్బ తగిలింది. తుపాను బాపట్ల వద్దే తీరం దాటడంతో భారీవర్షాలకు కర్లపాలెం, బాపట్ల, పిట్టలవానిపాలెం మండలాల్లో వరి పైరు నీటిలోనే ఉండిపోయింది. పంటనష్టాన్ని ప్రత్యక్షంగా పరిశీలించేందుకు ముఖ్యమంత్రి శుక్రవారం బాపట్ల రానున్నారు. కర్లపాలెం ప్రాంతంలో నీటిలో మునిగిన పంటలను పరిశీలించి రైతులతో సమావేశమవుతారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా శుక్ర, శనివారాల్లో బాపట్ల జిల్లాలో పర్యటించి పంటనష్టాన్ని పరిశీలిస్తారు. శుక్రవారం వేమూరు, రేపల్లె నియోజకవర్గాల్లో పర్యటిస్తారు. రాత్రికి బాపట్లలో బస చేసి శనివారం పర్చూరు నియోజకవర్గంలో పంటలను పరిశీలిస్తారు. రైతులతో భేటీ అవుతారు.

కర్లపాలెంలో వర్షపునీటిలో మునిగిన వరి పైరు

మిచౌంగ్ తుపాను కారణంగా బాపట్ల జిల్లాలో 168 గ్రామాలకు చెందిన వివిధ పంటలు నీట మునిగి 2,79,570 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. ఇందులో 1,86,170 ఎకరాల్లో వరిపైరు దెబ్బతింది. మొక్కజొన్న 13,060 ఎకరాలు, శనగ 16,902 ఎకరాలు, మినుము 42,255 ఎకరాలు, పొగాకు 8,870 ఎకరాలు, పలు ఇతర రకాల పంటలకు 6,537 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. జిల్లాలో ప్రధానంగా అమృతలూరు, బాపట్ల, భట్టిప్రోలు, చెరుకుపల్లి, చినగంజాం, చీరాల, కర్లపాలెం, కొల్లూరు, నగరం, నిజాంపట్నం, రేపల్లె, చుండూరు, వేమూరు మండలాల్లో వరి పైరుకు అధికంగా నష్టం వాటిల్లింది. చీరాల మండలంలో మినుము, ఇంకొల్లు మండలంలో శనగకు అధికంగా నష్టం వాటిల్లింది. జిల్లాలో ఆలేరు, కప్పలవాగు, రొంపేరు డ్రైన్లకు ఎనిమిది చోట్ల గండ్లు పడ్డాయి. ఓగేరు, నల్లమడ వాగులకు 34 చోట్ల గండ్లు పడ్డాయి. బాపట్ల ప్రాంతంలో పలు వాగులు, కాలువలకు గండ్లు పడ్డాయి, కొమ్మమూరు కాలువకు 14 చోట్ల గండ్లు పడ్డాయి. తక్షణం వీటికి మరమ్మతులు జరపాల్సి ఉంది.

డ్రైన్ల మరమ్మతులకు నిధులేవీ.?

- ప్రభుత్వం నిధులు ఇవ్వకనే రైతులకు ఈ దుస్థితి
- జిల్లాలో మరమ్మతులకు నోచుకోని మురుగు కాలువలు, వాగులు
- రైతులను ముంచిన గుర్రపుడెక్క, తూటికాడ..

పర్చూరు-కారంచేడు మధ్య వాగులో వరద నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న గుర్రపు డెక్క

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

చాలా కాలంగా జిల్లాలోని వాగులు, కాలువలు మరమ్మతులకు నోచుకోని కారణంగా రైతులు ఏటా పంటలను నష్టపోతున్నారు. తుపాన్ కారణంగా కురిసిన భారీవర్షాలతో వచ్చిన వరదనీరు సక్రమంగా దిగువకు వెళ్లే వీలులేక పంట పొలాలు మునిగి రైతులు తీవ్రంగా నష్టపోవడం పరిపాటిగా మారింది. లక్షలాది ఎకరాల్లో పంటలు నీట మునిగిపోతున్నాయి. తుపాను ప్రభావంతో వరి, పొగాకు, మిరప, పత్తి, మొక్కజొన్న, వేరుశనగ పొలాలన్నీ నీట మునిగి కోట్లాది రూపాయల పంట నష్టం వాటిల్లుతోంది. పంట పొలాలకు సక్రమంగా సాగు నీరు చేరాలన్నా, వచ్చిన వరదనీరు వేగంగా దిగువకు వెళ్లాలన్నా ఏటా కాలువలకు మరమ్మతులు జరగాలి.

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వాగులు, పంట కాలువలు, మురుగుకాలువ మరమ్మతుల గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. ఏటా వేసవిలో అధికారులు మరమ్మతుల గురించి అంచనాలు రూపొందించడం జరుగుతుంది. అధికారులు చేస్తున్న ప్రతిపాదనలు ఏనుగంత ఉంటే.. మంజూరు చేస్తున్న మొత్తం చీమంత ఉంటోంది. చేపట్టిన పనులు కూడా సకాలంలో పూర్తవుతున్న దాఖలాలు లేవు. బాపట్ల జిల్లా పరిధిలోనే అత్యధికంగా వాగులు, డ్రెయిన్లు ఉన్నాయి. అతి పెద్ద డ్రెయిన్లు ఉన్నాయి. ఎగువ నుంచి వచ్చే వరదనీరు, మురుగు నీరు అంతా జిల్లా మీదుగానే ప్రవహిస్తూ సముద్రంలో కలుస్తోంది. గతంలో చీరాల, బాపట్ల ప్రాంత పంటపొలాలు ఏటా వరదనీటిలో మునిగిపోతున్న నేపథ్యంలో చీరాల, వేటపాలెం వద్ద స్ట్రయిట్‌కట్‌లను ఏర్పాటు చేశారు. వీటితో పాటు జిల్లాలో నల్లమడ వాగు, మొండి వాగు, రొంపేరు డ్రైన్, పేర్లి డ్రైన్, భట్టిప్రోలు డ్రైన్, రేపల్లె డ్రైన్‌తో పాటు పలు వాగులున్నాయి. వీటన్నింటినీ ఆధునీకరించడం ద్వారా పంటపొలాలు ముంపునకు గురికాకుండా చూడాల్సి ఉంది. మరమ్మతులు జరగక అన్ని వాగులు, కాలువల్లో గుర్రపుడెక్క విపరీతంగా ఉండిపోయింది. దీంతో పాటు అధికారపార్టీ నేతలు వాగుల్లో మట్టిని కట్ట అంచులతో సహా అక్రమంగా తరలించుకెళ్లారు. కట్టలు పటిష్టంగా లేక కొన్ని చోట్ల వాగులు, డ్రైన్లు తెగిపోయాయి. గుర్రపు డెక్క, తూటికాడ, తూములు, బ్రిడ్జిల వద్ద వరదనీటి ప్రవాహానికి అడ్డుపడింది. ఈ కారణంగా వరదనీరు ముంచెత్తి పంటపొలాల మీదుగా పారింది. పర్చూరు వద్ద మొండి వాగుకు ఉధృతంగా వరద వచ్చింది. బాపట్ల వద్ద నల్లమడ వాగు ఉధృతికి కట్టలు తెగాయి. కొమ్మమూరు కాలువకు 14 చోట్ల గండ్లు పడ్డాయి. లక్షల ఎకరాలకు సాగునీరిచ్చే కొమ్మమూరు చాలా కాలంగా అభివృద్ధికి నోచుకోలేదు. ఈ కారణాలతోనే గడిచిన మూడేళ్లుగా సాగునీరు అందక, వరదలు వచ్చి పంటలు మునిగి రైతులు నష్టపోతున్నారు.

గతేడాది మురుగు కాలువల మరమ్మతులకు రూ.13.71 కోట్ల నిధులు కేటాయించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే సకాలంలో టెండర్లు పిలిచి పనులు చేపట్టాల్సి ఉండగా విపరీత ▶ 2లో

ఆటోలో ప్రయాణిస్తున్న కలెక్టర్, జడ్పీ చైర్‌పర్సన్

మెరుగైన జీవనోపాధికి 'మహిళా శక్తి ఆటో' ▲ 8లో

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఎన్నికలను సజావుగా నిర్వహించడంలో

ఎస్ఒ, పిఎస్ఒలదే కీలకపాత్ర

కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఎన్నికలు సజావుగా, సక్రమంగా జరిగేలా చూడటంలో సెక్టార్ అధికారులు (ఎస్ఒ), పోలీసు సెక్టార్ అధికారు(పి.ఎస్.ఓ)లదే కీలక పాత్రని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మేరకు ఈ దిశగా విధులు నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ అంశాలపై ఎస్ఒ, పిఎస్ఒలకు గురువారం ఒంగోలు జిజిహెచ్ ఆడిటోరియంలో ప్రత్యేక ఓరియంటేషన్ నిర్వహించారు. విధుల నిర్వహణపై కలెక్టర్ తో పాటు ఎస్‌పి మలికా గర్గ్ వీరికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యాత్మక ప్రాంతాలు, క్లిష్టమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవడం ద్వారా ఎన్నికలు సజావుగా జరిగేలా చూసే గురుతర బాధ్యత ఎస్ఒ, పిఎస్ఒలపై ఉందన్నారు. ఎన్నికలకు ఆరు నెలల ముందుగానే వీరిని నియమించడమే ఇందుకు నిదర్శనమని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ రాగానే ఎస్ఒలకు మేజిస్టీరియల్ ▶ 2లో

ఎస్ఒ, పిఎస్ఒలదే కీలకపాత్ర

(మొదటిపేజీ తరువాయి)

అధికారాలు వస్తాయన్నారు. తమకు కేటాయించిన సెక్టార్లలోని పోలింగ్ కేంద్రాలు, రూట్ మ్యాప్, స్థానిక పరిస్థితులు, పోలింగ్ కేంద్రాలకు వెళ్లడానికి ఓటర్లకు ఉన్న మార్గాలు, వివిధ రూపాలలో అడ్డంకులు ఎదురయ్యే అవకాశం, ఎన్నికల గత చరిత్రపై సంపూర్ణ అవగాహన ఏర్పరచుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాలలో కల్పిస్తున్న వసతులను కూడా క్షుణ్ణంగా పరిశీలించాలని ఆయన ఆదేశించారు. వివిధ వర్గాల వారితో మాట్లాడడంతోపాటు పరిస్థితులను బట్టి స్థాయిలోనే నిర్ణయం తీసుకుని ఉన్నతాధికారులకు నివేదించాలని దిశా నిర్దేశం చేశారు. ఎన్నికలు స్వేచ్ఛగా, సజావుగా జరిగేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారనే విశ్వాసాన్ని ఓటర్లలో కల్పించాల్సిన బాధ్యత ఎస్ఒ, పిఎస్ఒలదేనని తెలిపారు. ఈ దిశగా సమన్వయంతో పనిచేయాలని వారిని ఆదేశించారు. జిల్లా ఎస్పి మలిక గర్గ్ మాట్లాడుతూ ఎఎస్ఒ, పిఎస్ఒలు ప్రత్యక్షంగా ఎన్నికల కమిషన్ ఆధీనంలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. విధుల నిర్వహణలో పరిశీలించిన అంశాలను కేవలం పైస్థాయి అధికారులకు మాత్రమే నివేదించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఏమైనా ఇబ్బందులు తలెత్తినా మీడియాతో, స్థానిక నాయకులతో వీటిని ఎట్టి పరిస్థితులలోనూ పంచుకోరాదన్నారు. ఎన్నికల కమిషన్ ఇచ్చిన హాండ్ బుక్ లోని మార్గనిర్దేశాలను, ఎంసిసి రూల్స్‌ను ఉల్లంఘించరాదని ఎస్పి ఆదేశించారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ కె. శ్రీనివాసులు, డిఆర్ఒ ఆర్.శ్రీలత, ఏఎస్పిలు కె.నాగేశ్వరరావు (అడ్మిన్), ఎస్వి శ్రీధర్ రావు (క్రైమ్), అశోక్ బాబు (ఏఆర్), మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, ఒంగోలు ఆర్డీవో విశ్వేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

డ్రైన్ల మరమ్మతులకు నిధులేవీ?

(మొదటిపేజీ తరువాయి)

జాప్యం చోటు చేసుకుంది. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండేళ్ళపాటు పలు పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులు జరగలేదు. బిల్లులు ఏవైనా వచ్చినా అవి అరకొరగానే వచ్చాయి. గతంలో చేసిన పనులకే బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్న కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు అప్పట్లో ఆసక్తి చూపలేదు. చీరాల డ్రైనేజి డివిజన్ పరిధిలో 28 పనులను రూ.2.59 కోట్ల అంచనాలతో, రేపల్లే డ్రైనేజి డివిజన్‌లో 65 పనులను రూ.6.12 కోట్ల అంచనాలతో టెండర్లు పిలిచారు. బిల్లులు మంజూరు కావన్న సందేహంతో కాంట్రాక్టర్లు టెండర్లు వేసేందుకు చాలా కాలం ముందుకు రాలేదు. అధికారుల ఒత్తిడితో వ్యవసాయ పనులను ప్రారంభించాక వీలున్న చోట అరకొరగా మురుగు కాలువల మరమ్మతులు జరిగాయి.

ఈ ఏడాది ఉమ్మడి ప్రకాశం,గుంటూరు జిల్లాల పరిధిలో రూ 6.27 కోట్ల అంచనాలతో 58 పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచారు. రొంపేరు, నల్లమడ వాగులతో పాటు, వేటపాలెం, ఈపురుపాలెం స్ట్రయిట్ కట్ పనులు, పలు మేజర్, మీడియం డ్రైయిన్ల మరమ్మత్తులు చేపట్టాల్సి ఉంది. ఈ ఏడాది కూడా వ్యవసాయ పనులు ప్రారంభం అయ్యాకనే మురుగు కాలువల మరమ్మత్తుల పనులు చేపట్టారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు రూ.4 కోట్ల విలువైన పనులు చేశారని, కానీ ప్రభుత్వం నుంచి నేటికీ ఒక్క బిల్లు కూడా విడుదల కాలేదని తెలుస్తోంది. రాష్ట్రప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరించడకపోవడం, నిధులు విడుదల చేయని కారణంగానే ఏటా రైతులు నష్టపోతున్నారు.

వైసిపిని అధికారంలోకి తేవాలి

ప్రజాశక్తి-కొనకనమిట్ల: కొనకనమిట్ల మండలం వెలిగండ్ల సచివాలయం పరిధిలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం గురువారం జరిగింది. ఎంపిపి మురళీ కృష్ణ, జడ్‌పిటిసి అక్కిదాసరి ఏడుకొండలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రజలకు మరింత మంచి చేయడానికి మరోసారి వైసీపీని అధికారంలోకి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మోర శంకర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ సూరవరపు వెంకటరెడ్డి, సర్పంచ్‌లు పాతకొట వెంకటరెడ్డి, సిద్ధాబి నాభీ, వైస్ ఎంపిపి మెట్టు వెంకటరెడ్డి, ఎంపిడిఒ అద్దంకి శ్రీనివాసమూర్తి, పంచాయతీ సెక్రటరీ, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఇంటింటికీ తిరిగి ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. ఈ సేకరణలో ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.

నివాళులర్పిస్తున్న మున్సిపల్ వైస్ ఛైర్మన్ పులి శాంతి కుటుంబ సభ్యులు

పులి వెంకటరెడ్డికి ఘన నివాళి

ప్రజాశక్తి-కనిగిరి

కేంద్ర కార్మిక శాఖ మాజీ మంత్రి పులి వెంకటరెడ్డి 23వ వర్ధంతి కార్యక్రమాన్ని కుటుంబ సభ్యులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పులి వెంకటరెడ్డి పార్కులో ఆయన మనవరాలు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ పులి శాంతి, గోవర్ధన్ రెడ్డి దంపతులు, పులి లక్ష్మి, 17వ వార్డు కౌన్సిలర్ దేవకి రాజీవ్‌లు పులి వెంకటరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పులి వెంకటరెడ్డి వెలిగండ్ల సమితి ప్రెసిడెంట్‌గా, రెండు పర్యాయాలు శాసనసభ్యునిగా, మూడుసార్లు పార్లమెంట్ సభ్యునిగా, కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా పనిచేశారని వివరించారు. వెనుకబడిన ప్రకాశం జిల్లాకు ఎన్నో సేవలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో పులి నాగేంద్ర, రుద్ర, సందాని, పాచ్చు, మన్సూర్, భారత్ గ్యాస్ సిబ్బంది నివాళులు అర్పించారు.

వృద్ధురాలిని పరామర్శిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ అబ్దుల్ గఫార్

అనాథ వృద్ధురాలికి మున్సిపల్ ఛైర్మన్ పరామర్శ

ప్రజాశక్తి-కనిగిరి: కనిగిరి పట్టణంలోని జీప్ సెంటర్లో గుర్తు తెలియని ఒక వృద్ధురాలు గత కొన్ని రోజులుగా పడిపోయి ఉండడం గమనించిన స్థానిక జీపు డ్రైవర్లు గురువారం పారా లీగల్ వాలంటీర్, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్‌బాబుకు విషయం తెలియజేశారు. ఆయన వెంటనే మున్సిపల్ ఛైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్‌కు ఫోన్ చేసి సమాచారం అందించిన వెంటనే ఛైర్మన్ జీప్ సెంటర్లో ఉన్న వృద్ధురాలి దగ్గరకు వచ్చి ఆమెను పరామర్శించారు. ఆమె తన పేరు సుబ్బమ్మ అని చెబుతోంది కానీ ఊరి పేరు చెప్పలేకపోతోంది. ఆమె తుపాను కారణంగా బయటకు ఎక్కడికి వెళ్లలేక, ఆహారం లేక వినాయకుడి గుడి వద్ద సొమ్మసిల్లి పడిపోయి ఉండడం గమనించారు. వెంటనే టిఫిన్ ఏర్పాటు చేసి ఆమెను పరిశీలించగా కాలుకు బలమైన గాయం తగిలి ఉండడాన్ని గుర్తించారు. వెంటనే ప్రభుత్వ హాస్పటల్‌కు తరలించారు. హాస్పటల్ సూపరింటెండెంట్ డాక్టర్ అబ్దుల్ కలాం నేతృత్వంలో ఆమెకు చికిత్స చేయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ వృద్ధురాలికి సంబంధించిన వ్యక్తులు ఎవరైనా ఉంటే ప్రభుత్వ హాస్పటల్‌కు వచ్చి తీసుకొని వెళ్లాలని కోరారు. పారా లీగల్ వాలంటీరు, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ రమేష్‌బాబు, జిఎస్ అండ్ జీడీకే ఫౌండేషన్ కోఆర్డినేటర్ నవకుమార్, మున్సిపల్ సిబ్బంది, స్థానిక జీపు డ్రైవర్లు పాల్గొన్నారు.

కాలువలను పరిశీలించిన ఎమ్మెల్యే బలరాం

ప్రజాశక్తి-చీరాల: తుపాను ప్రభావంతో చీరాల నగర్ పాతచీరాల కొత్తపాలెం పంచాయతీల ప్రాంతలలో దెబ్బతిన్న పంట పొలాలను ఎమ్మెల్యే బలరాం అధికారులతో కలసి గురువారం పరిశీలించారు. కాలువలోకి చేరిన వర్షపు నీరు అధికంగా రావటం మరోవైపు రోశయ్య బ్రిడ్జి, సైపింగ్ బ్రిడ్జి, పాలేటి రామారావు బ్రిడ్జి వద్ద ఉన్న గుర్రపు డెక్క నీటి ప్రవాహానికి అడ్డుగా ఉండటంతో వెంటనే తొలగించమని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సరోజిని, తహశీల్దారు ప్రభాకరరావు, డ్రైనేజీ డిఈ సుబ్బారావు, మునిసిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు, చీరాల మండలం పార్టీ అధ్యక్షులు ఆసాది అంకాలరెడ్డి, బక్కా అద్దంకిరెడ్డి, పృధ్వీ ధనంజయ, బక్కా శ్రీనివాసరెడ్డి, ముచ్చు దేవేంద్ర, బోయిన బాజిరెడ్డి, ఆశాది దశరథరామి రెడ్డి, కుంచాల రత్నారెడ్డి, బక్కా శివ నాగులరెడ్డి, దేవు అద్దంకిరెడ్డి, సెక్రెటరీ, వీఆర్వోలు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి: ఎంఎం కొండయ్య

ప్రజాశక్తి-చీరాల: మిచౌంగ్ తుపాను వలన వర్షపు నీటితో పంట పొలాలు మునిగి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని టిడిపి ఇన్‌ఛార్జి ఎంఎం కొండయ్య కోరారు. స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. నియోజకవర్గంలో పంట పొలాలన్నీ నీట మునిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి ఆధ్వర్యంలో పలుచోట్ల ఆహార పదార్థాలను పంపిణీ చేశామన్నారు. తుపాను బాధితులను పరమర్శించేందుకు శుక్రవారం బాపట్ల జిల్లాలో చంద్రబాబు పర్యటిస్తున్నాని తెలిపారు. ఈ కార్యక్రమంలో మామిడిపాక హరిప్రసాద్, గంజి పురుషోత్తం, డేటా నాగేశ్వరరావు, గజవల్లి శ్రీనివాసరావు, కొంర్డు రత్నబాబు, ఉసిరిపాటి సురేష్, కౌత్రపు జనార్ధనరావు, అంగిరేకుల వెంకటేశ్వరరావు, అనపర్తి రత్నబాబు, లావేటి శ్రీనివాస తేజ అలపన అరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం పేరుతో సంక్షోభ పాలన: డాక్టర్ ఉగ్ర

ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న డాక్టర్ ఉగ్ర

ప్రజాశక్తి-కనిగిరి: కనిగిరి మునిసిపాలిటీలో 25వ రోజు గురువారం పాతూరు ఎస్సీ కాలనీలో మన ఊరు-మన ఉగ్ర, బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాలను నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాల గురించి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌ఛార్జి డాక్టరు ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. మినీ మేనిఫెస్టో పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. సంక్షేమం పేరుతో సంక్షోభ పాలనను వైసీపీ ప్రభుత్వం సాగిస్తోందని విమర్శించారు. ప్రజల గోడు పట్టని వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాలని అన్నారు. సైకో పోవాలి సైకిల్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. టిడిపి నాయకులు నంబుల వెంకటేశ్వర్లు, వివిఆర్ మనోహర్రావు, షేక్ ఫిరోజ్, తమ్మినేని వెంకటరెడ్డి, షేక్ అహ్మద్, బుల్లా బాలబాబు, పచ్చవ చంద్రశేఖర్, చింతలపూడి తిరుపాలు, ఆర్‌వి నారాయణ, పాలూరు సత్యం, ఈదర రవికుమార్ పాల్గొన్నారు.

మహారాజ శ్రీ 13వ అదనపు జిల్లా & సెషన్స్ జడ్జి విజయవాడ వారి కోర్టులో..

ఐ.ఎ.నెం :74/2023

ఓ.ఎస్.నెం : 148/2009

మధ్యలో

పఠాన్ అల్లాఉద్దీన్‌ఖాన్ మరి ఇద్దరు .... పిటిషనర్లు / వాదులు

ఎదిరి

పఠాన్ మస్తాన్ ఖాన్ మరి ఇతరులు ..రెస్పాండెంట్లు

టు

(R64) దామర్ల హనుమంతరావు S/o భీమారావు, **R/o. D.No : 20-8-24,** చీరాల పట్టణం & మండలం, బాపట్ల జిల్లా. ఎపి

పై నెంబరు వ్యాజ్యములో మిమ్ము ప్రతివాదిగా చేర్చుటకు గాను వేసిన పై పిటిషన్ నందు శ్రీ కోర్టు వారు పంపిన నోటీసులు తీసుకొనందున మీకు నోటీసు, హాజరు నిమిత్తం ది: 08-12-2023 నకు వాయిదా వేసియున్నారు. సదరు వాయిదా తేదీ : 08-12-2023 న ఉదయం 10:30 గం,ని,, మీరు స్వయముగా గాని, వకీలు ద్వారా గాని హాజరై సంజాయిషి తెలుపుకొనవలెను. లేనిచో శ్రీకోర్టువారు మీ పరోక్షమున తీర్మానించెదరు.

// ఆదేశానుసారముగా //

ఇట్లు
బూదరాజు శశికిరణ్
న్యాయవాది,
కొత్తపేట - చీరాల 523157,
బాపట్ల జిల్లా, ఎపి
సెల్ : 9247466776

మహారాజశ్రీ మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

ఓఎస్ : 304/2022

మల్లె మంగమ్మ, భర్త: లేట్ ఏడుకొండలు, వయసు: 38 సం॥లు, హిందూ, కూలి, నివాసం: పెద్ద నాగులవరం గ్రామం, మార్కాపురం మండలం, ప్రకాశం జిల్లా .... వాది

వర్సెస్

తమ్మిశెట్టి శ్రీనివాసులు తండ్రి: వెంకటేశ్వర్లు, వయసు: 41 సం॥లు, హిందూ, కాంట్రాక్టర్ మరియు వ్యాపారం, నివాసం: పెద్ద నాగులవరం గ్రామం, మార్కాపురం మండలం, ప్రకాశం జిల్లా .... ప్రతివాది

పై నెంబరు దావా వాది మీ పైన ప్రోనోట్ బాకీని రాబట్టు కొరకు దాఖలుచేశారు. ఈ దావా నందు ప్రతివాది అయిన మీకు ఎన్ని పర్యాయములు దావా సమనులు పంపిననూ అందుట లేని కారణంగా శ్రీకోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా దావా సమనులు జారీ చేయమని ఆర్డర్ వేసియున్నారు. కావున మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల వాయిదా తేదీన అనగా 15-12-2023వ తేదీన ఉదయం 10:30 గంటలకు మీరు స్వయముగా గానీ లేక మీ వకీలు ద్వారా గానీ మీ యొక్క ఆక్షేపణలు తెలుపు కొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని ఖండితముగా తెలియజేయడ మైనది.

// కోర్టు వారి ఉత్తర్వులతో //

వాయిదా : 15-12-2023

గెల్లి చౌడేశ్వరరావు,
న్యాయవాది, మార్కాపురం

నోటీసు

మహారాజశ్రీ గుంటూరు 1వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

యం.వి.ఒ.పి.నెం. 329/2022

మాలపాటి మల్లేశ్వరి వగైరాలు ...పిటీషనర్లు

ఎదిరి

పాముల పూర్ణ చంద్రుడు వగైరాలు ...రెస్పాండెంట్స్

టు,

1వ రెస్పాండెంటు:- పాముల పూర్ణచంద్రుడు, తండ్రి.నారాయణ, సాకిన్: పెద్దరావీడు గ్రామం, మార్కాపురం రెవెన్యూ డివిజన్, ప్రకాశం జిల్లా.

(కారు డ్రైవరు నెం.AP 39 TT 8815)

ఈ నెంబరు పిటీషనులో పిటీషనర్లు యాక్సిడెంటుకు నష్టపరిహారము కోరుచూ పిటీషనరు ఈ నెంబరు ఒ.పి. ని దాఖలు చేసినారు. సదరు పిటీషనులో 1వ రెస్పాండెంటు అయిన మీరు కోర్టు నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ వార్త పత్రిక ద్వారా మీకు తెలియజేయమని ది. 18-12-2023వ తేదికి వాయిదా వేసి యున్నారు. కావున ఈ రోజు ఉదయం 10-30 గంటలకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా: 18-12-2023

వై.ఋషికేష్ రెడ్డి,
పిటీషనర్లు తరుపు న్యాయవాది,
గుంటూరు.

Notice under Order 21, Rule 54 (1A)

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE, KANDUKUR

E.P.No. 13/2016

Kavali O.S.No. 31/2002

Srinivasa Agencies, Kavali, it's Proprietor **P.V.Lakshmi,** Rep.by her GPA **P.Nageswara Rao,** - DHR/Plaintiff

Vs

M/s. Dhanya Lakshmi Ryot Depot, Rep. by its Proprietor **Shaik Jhani Basha** - JDR/Defendant

To,
Shaik Jhani Basha, S/o **Hussain Saheb,** Business, resident of Pamuru Village and Mandal, Prakasam District.

Sir,

Whereas you have failed to satisfy a decree passed against you on the file of Hon'ble Senior Civil Judge Court, Kavali, on **02.05.2003** in **OS No.31/2002** in favour of DHR for **Rs.2,36,003.00**, it is ordered that you the JDR is hereby Prohibited and restrain from transferring or Charging the property specified in the scheduled hereunder by sale, gift or otherwise and that a persons and that they are hereby prohibited from receiving the same day purchase, gift or otherwise until discharge of the decree debt and further order of the court, it is also ordered that you should attend court on the date **15.12.2023.**

To take notice of the date fix for setting the terms of the proclamation of sale.

SCHEDULE

Prakasam District Registration, Kanigiri Sub Registration, Pamuru Mandal, Pamuru Village and Panchayat, D.No. 4-93, Assessment No.1428, RCC Building and vacant site **bounded by:- East :** Road, **South:** House of Nagineni Tirupathaiah, **West :** Road, **North :** House of Solleti Srinivasulu. Within four boundaries 30 gadees site wherein 16 gadees plinth area RCC building.

D.H.R.Value : **Rs. 4,00,000/-**
Warrant Amount : **Rs. 2,36,006.00**
Hearing Date : **15.12.2023**

// By Order //
P.V.Ranga Raju
Advocate for DHR

ప్రజాశక్తి 3
శుక్రవారం 8 డిసెంబరు 2023

చెరువులో చేపలు పడుతూ యువకుడు గల్లంతు

ప్రజాశక్తి కంభం రూరల్

ఇర్ఫాన్ (ఫైల్)

చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన కంభం చెరువులో గురువారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. కంభం పట్టణంలోని నాయక్ వీధికి చెందిన ఇర్ఫాన్(28) అనే యువకుడు గురువారం మిత్రులతో కలిసి సరదాగా చేపలు పట్టేందుకు వెళ్లాడు. చెరువులో గాలం వేశాడు. గాలానికి పెద్ద చేప పడింది. దాన్ని బయటకు లాగే సమయంలో ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయాడు. ఈ విషయాన్ని గమనించిన తోటి మిత్రులు, బంధువులు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు చెరువు వద్దకు వచ్చి గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం సమయంలో మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడు ఇర్ఫాన్ అవివాహితుడు. తండ్రి గతంలో అనారోగ్యంతో మృతి చెందడంతో ఇర్ఫాన్ విద్యుత్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.

బైకును ఢీకొన్న లారీ.. వ్యక్తి మృతి

ప్రజాశక్తి-అద్దంకి

ముందువెళ్తున్న బైకును లారీ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన అద్దంకి పట్టణ సమీపంలోని కలవకూరు రోడ్డు జంక్షన్ వద్ద గురువారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. అద్దంకికి చెందిన కుంచాల నరసింహారావు(67), కట్టకిందపాలెంకు చెందిన ఉప్పు రోశయ్య బైకుపై భవానీ సెంటర్ వైపు వస్తున్నారు. అదే సమయంలో బైకును వెనుక నుంచి లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో నరసింహారావు అక్కడికక్కడే మృతి చెందారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఘటనా స్థలం వద్ద ఆగి ప్రమాదం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రయివేటు అంబులెన్స్‌లో క్షతగాత్రుడిని, నరసింహారావు మృతదేహాన్ని పభుత్వ వైద్యశాలకు తరలించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-మద్దిపాడు: మద్దిపాడులో గురువారం ఆర్‌టిసి బస్సు ఢీకొన్న ఘటనలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ శ్రీకాంత్ కథనం ప్రకారం.. ఒంగోలు డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు మద్దిపాడు ఫ్లైఓవర్ వద్ద గుర్తు తెలియని వ్యక్తిని ఢీకొంది. దీంతో ఆ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆ వ్యక్తి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

మట్టి గోడ కూలి వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండలంలోని ఐలవరం తూర్పు దళితవాడలో భారీ వర్షాలకు గురువారం తెల్లవారు జామున పూరిగుడిసెలో నిద్రిస్తున్న వృద్ధురాలు మట్టిగోడ కూలి మృతి చెందారు. గ్రామానికి చెందిన కర్ర అన్నపూర్ణమ్మ(65)తన పూరి గుడిసెలో నివాసం ఉంటోంది. మృతి సమాచారం తెలుసుకున్న తహశీల్దారు ధూళిపూడి వెంకటేశ్వరరావు, విఆర్ఒ రత్నాకరుడును పంపించి వివరాలు సేకరించి నమోదు చేశారు. తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు పూరి గుడిసె ఓ పక్కకు ఒరిగిపోయింది. దానికున్న మట్టిగోడలు నాని విరిగి అన్నపూర్ణమ్మపై పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

వృద్ధురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-భట్టిప్రోలు: మండలంలోని ఐలవరంలో గోడ కూలి మృతి చెందిన వృద్ధురాలి కుటుంబానికి మట్టిఖర్చుల నిమిత్తం రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని పల్లికోన గ్రామానికి చెందిన గ్రేస్ ఫౌండేషన్ అధినేత కైతేపల్లి షాలెంరాజు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు బందెల సురేష్, నల్లూరు రవి, పచ్చిగల అనిల్, సుధీర్, సురేష్, జగ్గారావు ఉన్నారు.

వాగులో పడి మోటారుసైక్లిస్ట్ మృతి

ప్రజాశక్తి-కారంచేడు: కారంచేడు-స్వర్ణ మధ్యలో ఉధతంగా ప్రవహిస్తున్న వాగులో పడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన కారంచేడులో గురువారం జరిగింది. కారంచేడు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంకొల్లుకు చెందిన దగ్గుబాటి కిషోర్‌కుమార్(61) వ్యక్తిగత పని మీద గురువారం ఆయన ద్విచక్ర వాహనంపై కారంచేడుకు వస్తున్నారు. స్వర్ణ-కారంచేడు మధ్య ఉన్న చప్టాను దాటబోయి అదుపుతప్పి వాగులో పడ్డాడు. వాగులో కొట్టుకొనిపోయి మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రొటెక్షన్ వాచర్‌పై ఎలుగుబంటి దాడి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల: దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలోని ఇష్టకామేశ్వరి దేవాలయం దగ్గర ప్రొటెక్షన్ వాచర్‌గా విధులు నిర్వహిస్తున్న చెవుల వెంకటేశంపై గురువారం ఎలుగుబంటి దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. విధులు ముగించుకొని ఇంటికి వస్తున్న సమయంలో ఎలుగుబంటి దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రున్ని నంద్యాల జిల్లా సున్నిపెంట వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి ఒంగోలులోని రిమ్స్‌కు తరలించారు.

పాత తహశీల్దారు కార్యాలయాన్ని వినియోగంలోకి తేవాలి

ప్రజాశక్తి-కనిగిరి

ఆర్‌డిఒతో కలిసి పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

కనిగిరి పట్టణంలోని బ్రిటిష్ కాలంలో నిర్మించబడి శిథిలావస్థకు చేరిన కనిగిరి పాత తహశీల్దారు కార్యాలయాన్ని గురువారం కనిగిరి ఆర్డీవో జాన్ ఇర్విన్‌తో కలిసి కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ ఈ భవనం నుంచి నిత్యం సేవలు అందించేందుకు సౌకర్యవంతంగా లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. పాత తహశీల్దారు కార్యాలయానికి నూతనంగా పైకప్పు నిర్మిస్తే విధులను నిర్వహించుకోవచ్చని అన్నారు. మరమ్మతులు చేయిస్తే ఇతర ప్రభుత్వ అవసరాలకు కూడా వాడుకోవచ్చని ఆర్డిఓ జాన్ ఇర్విన్‌ను కోరగా అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. పాత తహశీల్దారు కార్యాలయాన్ని ఉన్నతాధికారులతో మాట్లాడి పునర్నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఓ రమణారెడ్డి, ఆర్ఐ రమేష్, మున్సిపల్ శానిటరీ ఇన్‌ఛార్జి ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు, మున్సిపల్ వైస్ చైర్మన్ మాణిక్యరావు తదితరులు పాల్గొన్నారు.

'ఉగ్ర'ను గెలిపించుకుందాం

ప్రచార కార్యక్రమంలో టిడిపి నాయకులు

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

కరపత్రాలు పంచుతున్న టిడిపి నాయకులు

రానున్న ఎన్నికల్లో కనిగిరి ఎమ్మెల్యేగా ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిని, ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడును గెలిపించుకోవాలని టిడిపి మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి గాయం తిరుపతిరెడ్డి అన్నారు. వైసిపి నేతలు దొంగ ఓట్లు చేర్పించడంలో సిద్ధహస్తులని, తమ మాయమాటలతో ప్రజలను మోసం చేశారని పేర్కొన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ అనే కార్యక్రమంలో భాగంగా తిమ్మారెడ్డిపల్లి, వాలిచర్ల, గ్రామాలలో ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తుందని అన్నారు. వైసిపి నేతలు అక్రమమార్గంలో గెలిచేందుకే ప్రయత్నిస్తున్నారని, చాలమందికి రెండు చోట్ల ఓట్లు ఉన్నాయని విమర్శించారు. వాటిని తొలగించాలని అధికారులకు తెలియజేశామని, ఎవరికైనా సరే ఒకరికి ఒక ఓటు మాత్రమే ఉండాలి' అని నేతలు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్లో ఎన్నికలు పారదర్శకంగా జరగాలనేది చంద్రబాబు ఆలోచన అని, వ్యవస్థలను మేనేజ్ చేయడంలో వైసీపీ నాయకులు దిట్ట అని విమర్శించారు. వైసీపీ నేతలు ప్రజలను ప్రలోభాలకు గురిచేస్తున్నారని, బోగస్ ఓట్లను తొలగించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో గాయం రామిరెడ్డి, గంగిరెడ్డి రమేష్‌రెడ్డి, చీకటి వెంకటసుబ్బయ్య, కూడాలి దశరథ, రాజారెడ్డి, మల్లెల తిరుపతయ్య, కోతుల సుబ్బారావు, తెలుగుదేశం పార్టీ బూత్ ఇన్‌ఛార్జులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయంలో సామాజిక తనిఖీ

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

హనుమంతునిపాడు ఎంపిడిఒ కార్యాలయంలో మండల అభివృద్ధి అధికారి కే లలిత అధ్యక్షతన సామాజిక తనిఖీ నిర్వహించారు. ఉపాధి హామీ చట్టం ద్వారా గ్రామాల్లో 2022, 2023 సంవత్సరాల్లో జరిగిన పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ ఏపీఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలంలోని 23 పంచాయతీల్లో రూ.11 కోట్ల 47 లక్షల మేర పనులు జరిగాయని అన్నారు. ఎవరికైతే వంద రోజులు పని దినాలు పూర్తి కాలేదో వారికి మరలా ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు. మండల అభివృద్ధి అధికారి కే లలిత మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో ఎటువంటి లోపాలు లేకుండా సరైన రీతిలో పనులు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాలలో ఎక్కడ ఉపాధి హామీ పనులు జరగడం లేదో గుర్తించి వారికి పనులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సామాజిక తనిఖీలో ఎటువంటి లోపాలు, అవతవకలు జరగలేదని వెల్లడైనట్లు ఎంపిడిఒ లలిత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, టిఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

తగ్గని వర్షపు నీరు.. ఆందోళన రైతులు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మొలలోతు నీటిలో మునిగిన పైరును చూపుతున్న రైతు

తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు నీట మునిగిన పంట పొలాల్లో నేటికీ నీరు బయటికి వెళ్లక రైతులు అవస్థలు పడుతున్నారు. భట్టిప్రోలు జగనన్న కాలనీ ఎదురుగా ఉన్న అద్దేపల్లి బాడవ పొలాల్లో మొలలోతున నీరు ఉండి పైరు పూర్తిగా దెబ్బతింటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం కష్టపడి సాగు చేసి పండించిన పంట చేతికందే సమయానికి ప్రకృతి ప్రతాపాన్ని చూపి రైతులను నట్టేట ముంచిందని వాపోతున్నారు. కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. భట్టిప్రోలుకు చెందిన వెంకటేశ్వరరావు అనే రైతు ఈ ఏడాది 15ఎకరాల కౌలు భూమిని సాగు చేశానని చెప్పారు. ఇప్పటికే కౌలు ఖర్చులతో కలిపి ఎకరాకు రూ.50 వేలు ఖర్చు చేశానని, పంటలు ఆశాజనకంగా ఉన్నాయని, చేసిన అప్పులు తీరతాయని భావించిన తరుణంలో తుపాను రూపంలో తనకు తీరని నష్టాన్ని కలిగించిందని వాపోయాడు. ఇప్పటికీ పంట చేలో ఉన్న నీరు ఎన్ని రోజులకు తగ్గుతుందో కూడా అర్థం కావట్లేదని ఆందోళన వ్యక్తం చేశాడు. ప్రభుత్వమే తమను అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జడ్‌పి చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

రైతులను ఆదుకోవాలని వినతి

ప్రజాశక్తి-దర్శి

మిచౌంగ్ తుపాను వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్‌ను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ కోరారు. గురువారం ఆమె కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. దర్శి నియోజకవర్గంతో పాటు జిల్లాలో తుపాను వల్ల నష్టపోయిన మిరప, కంది, పొగాకు, వరి పంటలను పరిశీలించి నష్టపరిహారం ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు.

పంట పొలాలను పరిశీలిస్తున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్లూరి కొండారెడ్డి

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-దర్శి

దర్శి నియోజకవర్గంలో దర్శితో పాటు దొనకొండ మండలాలను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్లూరి కొండారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్శి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో తుపాను కారణంగా రైతులు వేసిన పంటలన్నీ వర్షం వల్ల మునిగిపోయి నష్టపోయాయని అన్నారు. వారిని ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెన్నకేశవులు, దాసరి కోటి, అంజిరెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

కనిగిరిలో..

కనిగిరి: మిచౌంగ్ తుపాను ప్రభావం వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణమే ఎకరాకు 25వేల రూపాయలు పంట నష్టపరిహారం చెల్లించి వారిని ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు పీసీసీ సభ్యులు పిల్లి వెంకటేశ్వర రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాలలో గ్రామాలలోకి వెళ్లి రైతు క్షేత్రాలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆరు మండలాలు కనిగిరి, పామూరు, పిసిపల్లి, వెలిగండ్ల, హనుమంతునిపాడు, చంద్రశేఖరపురం లలోని గల పంటలైన వరి, మిరప, కంది, మిను ము, అరటి, బొప్పాయి, శనగ అన్ని రకాల పంటలు పూర్తిగా తుపాను వల్ల దెబ్బతిన్నాయని అన్నారు. కాబట్టి ప్రభుత్వం తక్షణమే తుపాను ప్రభావం వల్ల రైతులకు జరిగిన నష్టాన్ని ప్రభుత్వం చెల్లించి వారిని ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమన్వయ కమిటీ సభ్యులు సంగటి మల్లికార్జున రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అభిమానులు రవణమ్మ, తిరుపతయ్య, ఫ్రాన్సిస్ తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న పిల్లి వెంకటేశ్వర రెడ్డి

డ్రైనేజీపై సమగ్రమైన చర్యలు చేపట్టాలి

ఎపి రైతు సంఘం నాయకుల వినతి

ప్రజాశక్తి - రేపల్లె

తూఫాన్ వల్ల నష్టపోయిన పంటలను కాపాడేందుకు డ్రైనేజీ అధికారులు సమగ్ర ప్రతిపాదనలు చేయాలని, నిర్ధిష్ట చర్యలు తీసుకుని పొలాల్లో ఉన్న నీటిని తొలగించాలని ఎపి రైతు సంఘం, కౌలు రైతు సంఘం నాయకులు ఆర్‌డిఒ హేలా షారోన్‌కు వినతి పత్రం అందజేశారు. అందరికి నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వి వెంకటరామయ్య మాట్లాడుతూ తుఫాను వల్ల గత 3రోజులుగా కురిసిన వర్షాలకు కోతకు వచ్చిన వరిపంట మొత్తం నీట మునిగినందని పేర్కొన్నారు. వ్యవసాయ ఖర్చులు పెరిగి, పంటలకు గిట్టుబాటు ధర లేని స్థితిలో తుపాను ఆపార నష్టం కలుగజేసిందని అన్నారు. ఇప్పుడు కోత ఖర్చులు మూడు రెట్లు పెరిగాయని అన్నారు. కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె ప్రాంతాల్లోని గ్రామాల్లో మురుగునీటి సమస్య వుందని అన్నారు. కాలువల్లో గుర్రపుడెక్క, పూడికతో నిండిపోయి ఉన్నాయని అన్నారు. రైతుల పొల్లో నీరు బయటకు పోయే మార్గం లేక ఎక్కువ మంది రైతులు నష్టపోతున్నారని తెలిపారు. డ్రైనేజీ అధికారులు సమగ్రమైన చర్యలు చేపడితే పంట భూముల్లోని వర్షపునీళ్లు బయటికి వెళతాయని చెప్పారు. అలా చేస్తే కొంతమేరకైనా పంట చేతికొచ్చే అవకాశం ఉందని అన్నారు. తడిచిన ధాన్యాన్ని బేషరతుగా రూ.1700లకు కొనుగోలు చేయాలని కోరారు. రెండవ పంటసాగు చేసుకొనుటకు మొక్కజొన్న, మినుము, పెసర విత్తనాలు పూర్తి సబ్సిడీపై ఇవ్వాలని కోరారు. వరికి ఎకరాకు రు.25వేలు, అరిటికి రూ.50వేలు, మినుముకు రూ.20వేలు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. మాగాణి భూముల్లో పూడిక తియించాలని కోరారు. రేపల్లె మండలం పెనుమూడి, సింగుపాలెం, ఆరవపల్లి గ్రామాల్లో, కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని మురుగు కాలువల్లో పూడికలు తీయించాలని కోరారు. లంక గ్రామాల్లో రోడ్డు మార్జిన్లలో ఉన్న మురుగు పోయే కాలువలు ఆక్రమణకు గురై పొలాల్లో నీరు బయటకు పోయే మార్గం లేక చేలల్లోనే నీరు నిల్వవుందని అన్నారు. కాలువల ఆక్రమణలు తొలగించాలని కోరారు. సీపీఎం కార్యదర్శి సిహెచ్ మణిలాల్ మాట్లాడుతూ కౌలురైతులు, వాస్తవమైన సాగుదారుల పేరుతో నష్టపరిహారం అందే విధంగా నమోదు చేయాలని కోరారు. రైతులు, కౌలురైతులు మధ్య చైతన్యం తీసుకువచ్చి కౌలు రైతుల పేర్లతో నష్టపరిహారం నమోదు చేయాలని అన్నారు. సిఎం చెప్పేదానికి, అధికారులు చేసే పనులకు పొంతన లేదని ఆరోపించారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం (ఎఐకెఎస్), కౌలు రైతు సంఘం నాయకులు కె రామస్వామి, జి నాగరాజు, ఎం సత్యనారాయణ, జి దానియేలు, జి ధర్మరాజు, కె అశ్విరాదం, కె మరియయదాసు పాల్గొన్నారు.

ఆర్‌డిఒకు వినతి పత్రం ఇస్తున్న సిపిఎం, రైతు సంఘం నేతలు

పర్చూరు : తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాల వల్ల మిర్చి, పొగాకు, శనగ పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బండి శంకరయ్య అన్నారు. వ్యవసాయ అధికారులు పంట నష్టాన్ని నమోదు చేసి, ఈ క్రాప్ బుకింగ్‌తో సంబంధం లేకుండా నష్టపోయి న రైతులందరికీ పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మార్టూరు రూరల్ : మిచౌంగ్ తుఫాను సృష్టించిన బీభత్సా నికి పంట నష్టపోయిన రైతుల ను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం కార్యదర్శి బత్తుల హనుమం తరావు డిమాండ్ చేశారు. మార్టూరు, యద్దన పూడి మండ లాల్లో తుపాను తో దెబ్బతిన్న పంటలను అయన పరిశీలించారు. తుఫాను తీవ్రతతో వరి, ప్రత్తి, మిరప, మొక్కజొన్న పంటలన్నీ నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. యుద్ధ ప్రాతిపదికన పంట నష్టం వివరాలను అధికారులు నమోదు చేయాలని కోరారు. నష్ట పరిహారం సత్వరం అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బొడెంపూడి సూరిబాబు పాల్గొన్నారు.

అంజమరాజు ఆదర్శ కమ్యూనిస్టు

ప్రజాశక్తి - పంగులూరు

మాట్లాడుతున్న అనిల్‌కుమార్

ఎన్ని కష్టాలు వచ్చినా, ఎన్ని ఇబ్బందులు వచ్చినా, చివరిదాకా ఎర్ర జెండాను వదలకుండా కమ్యూనిస్టుగా బతికిన కామ్రేడ్ సరికొండ అంజమరాజు ధన్యజీవి అని సిపిఎం జిల్లా నాయకులు రాయిని వినోద్ బాబు, ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి సరికొండ అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని బైటమంజు లూరులో కామ్రేడ్ సరికొండ అంజమరాజు సంస్మరణ సభలో వినోద్ బాబు మాట్లాడారు. మొదటి నుండి కమ్యూనిస్టు భావాజాలం కలిగిన కుటుంబమని అన్నారు. పెద్ద రైతు కుటుంబం నుంచి వచ్చిన కూడా కమ్యూనిస్టుగా జీవించాడని అన్నారు. 82ఏళ్ళలో కూడా ప్రతిరోజు ప్రజాశక్తి పత్రిక చదివి, ఏదో విషయం మీద గ్రామంలో చర్చ పెట్టేవాడని అన్నారు. సరికొండ రామచంద్రరాజు మాట్లాడుతూ అంజమరాజు చిన్న వయసు నుండి ఆదర్శ భావాలు కలవాడని అన్నారు. అతని పెళ్లికి గ్రామంలో సహబంతి భోజనం పెట్టి ఆదర్శంగా నిలిచాడని అన్నారు. సభలోలో సుబ్బరాజు, సరికొండ పట్టాభిరామరాజు బ్రదర్స్, సిపిఎం నాయకులు గుడిపాటి మల్లారెడ్డి, లక్ష్మణ రాజు, వైసీపీ బీసీ సెల్ మండల కన్వీనర్ చక్రవరం భాస్కరరాజు, బత్తుల మోహనరావు, వైసిపి నాయకులు తిరుమలరాజు సందేశాన్ని వినిపించారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎఎంసి నూతన పాలకవర్గం

ఎఎంసి ఛైర్మన్‌గా సుబ్బాయమ్మ

ప్రజాశక్తి- సంతమాగులూరు

రైతాంగం సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని ఎఎంసి ఛైర్మన్ కుంచపు సుబ్బాయమ్మ రాఘవరావు తెలిపారు. మండలంలోని పుట్టావారిపాలెం గ్రామంలోని మార్కెట్ యార్డ్ కార్యాలయం నందు ఛైర్మన్‌గా ఆమె గురువారం బాధ్యతలు తీసుకున్నారు. సుబ్బాయమ్మ దంపతులకు మార్కెట్ యార్డ్ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. బల్లికురవ మండలం కొనిదెన గ్రామానికి చెందిన కుంచపు సుబ్బాయమ్మ ఛైర్మన్‌గా, ఏల్చూరు గ్రామానికి చెందిన ఇప్పల ముసలారెడ్డి వైస్ ఛైర్మన్‌గా, 15మంది మార్కెట్ కమిటీ సభ్యులుగా ఉన్నారు. ఏడాది పాటు పదవిలో కొనసాగనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు చింతల పేరయ్య, కుంచపు రాఘవరావు, కార్యదర్శి సిహెచ్ చార్లెస్, సూపర్ వైజర్ వై సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై సెమినార్

ప్రజాశక్తి - నగరం

బహుమతులు పొందిన విద్యార్థు

స్థానిక శ్రీ వెలగపూడి రామ కృష్ణ స్మారక కళాశా లలో 2023 అంత ర్జాతీయ చిరుధా న్యాల సంవత్సరం సందర్భంగా కళాశా లలో గురువాం సెమినార్ నిర్వహించారు. డ్రామాలు, వ్యాసరచన పోటీలు, రిలేలు నిర్వహించారు. కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ పూషడపు వెంకటనారాయణ అధ్యక్షత వహించి మాట్లాడారు. చిరుధాన్యాలు అనారోగ్య సమస్యలు నివారించవచ్చని తెలిపారు. కళాశాల ఎన్‌సిసి అధికారి వి సాంబమూర్తి మాట్లాడుతూ చిరుధాన్యాలు పీచు పదార్థాలను కలిగి ఉంటాయని అన్నారు. ఇవి అరుగుదలకు, మధుమేహం వ్యాధిగ్రస్తులకు చాలా మంచిదని అన్నారు. పిల్లలు, వృద్ధులకు కావలసిన పోషకాలు ఎక్కువగా ఉండడం చేత దేశంలో వీటి వాడకం ఎక్కువగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మాగంటి సుధాకరరావు, ఐక్యు ఎసి కోఆర్డినేటర్ ప్రసన్నబాబు, శ్రీదేవి, ఆఫీసు సూపరిండెంట్ అమరేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

రైతులందరికీ న్యాయం చేస్తాం : మోపిదేవి

ప్రజాశక్తి - చెరుకుపల్లి

తడిసిన వరి పనలు పరిశీలిస్తున్న మోపిదేవి

తుఫాను వలన నష్టపోయిన రైతులు అందరినీ ఆదుకుంటా మని రాజ్యసభ సభ్యులు మోపి దేవి వెంకటరమణరావు అన్నా రు. దెబ్బతిన్న వరి,మిరప పైరు లను ఆయన గురువారం పరిశీ లించారు. కనగాల, గూడవల్లి, నడింపల్లి, పొన్నపల్లి, తుమ్మలపాలెం, రాంబట్లపాలెం గ్రామాల పరిధిలోని వరి, మిరప పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఆరుగాలం కష్టపడి వ్యయ ప్రయాసలతో పండించిన పంట నీటమునిని నష్టపోయిన తమను ఆదుకోవాలని రైతులు కోరారు. రైతుల కష్టాన్నికి చలించిన సిఎం జగన్మోహన్‌రెడ్డి నష్టపోయిన రైతులందరినీ ఆదుకునేలా ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. రైతులందరికీ నష్టపరిహారం అందుతుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ రత్నప్రసాద్, జడ్పిటిసి పావని, తహశీల్దారు బి వెంకటేశ్వర్లు, ఎఒ టి బాలాజీ గంగాధర్ పాల్గొన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలే రైతులను ముంచాయి

ప్రజాశక్తి - కారంచేడు

కట్ట తెగి పొలాలపైకి ప్రవహిస్తున్న పర్చూరు వాగు

పర్చూరు వాగులో మట్టి అక్రమ తవ్వకాలు, అధికారుల పర్యవేక్షణ లోపమే పంట పొలాల ముంపుకు గురయ్యా యని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. పర్చూరు వాగులో పట్టపగలు వందలాది ట్రాక్టర్లు, జెసిబిలతో మట్టి త్రవ్వకాలు జరుగుతున్న అధికారులు పట్టించుకోలేదని రైతులు చెబుతున్నారు. పర్చూరు, కారంచేడు మధ్యలోని పర్చూరు వాగులో గత ఆరు నెలలుగా అడ్డగోలుగా మట్టి తవ్వకాలు జరుగు తుంటే ఆపే ప్రయత్నం ఎవ్వరూ చేయలేదని అంటు న్నారు. దీని ఫలితంగానే కారంచేడు రైతుల పొలాలు వరద పాలయ్యాయని రైతులు కన్నీటి పర్యంతం అవుతున్నారు. మట్టి తవ్వినచోట గట్లు సరిచేయకుండా వదిలి వేయడం వలన వరద ఉధృతికి గట్లు తెగిపోయి వరద నీరు పంట పొలాల్లోకి వెళ్ళింది. పర్చూరు వాగులో రామానాయుడు వారధి దగ్గర నుండి ఉప్పుటూరు బ్రిడ్జి వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర మట్టి అక్రమ తవ్వకాలు చేశారు. దీనిపై పలువురు రైతులు గతంలో అధికారులకు ఫిర్యాదు లు చేసినా ఎటువంటి స్పందన లేదు. రోడ్లపైకి వరద నీరు వచ్చి కల్వర్టులు కొట్టుకొని పోయి గ్రామాలకు రాకపోకలు కూడా ఆగిపోయాయని పలువురు చెప్తున్నారు. వరి, మిర్చి, పొగాకు, శనగ సాగు చేసిన రైతులు ఎకరాకు రూ.25వేల నుండి రూ80వేల వరకు నష్టపోయినట్లు చెబుతున్నారు. మూడు రోజులైనా ఎన్ని ఎకరాలు నష్టం జరిగిందో ఇంతవరకు అంచనాకు రాలేదు. ఇప్పటికైనా అదికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

97మందికి కంటి పరీక్షలు

పంగులూరు : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక రోటరీ భవన్లో ఉచిత కంటి పరీక్షలు గురువారం నిర్వహించారు. శిబిరానికి 97మంది హాజరుకాగా వీరిలో 62మందికి కంటి శుక్లంల ఆపరేషన్లు చేయాలని వైద్యులు నిర్ధారించారు. 62మందిని శంకర్ కంటి వైద్యశాలకు ప్రత్యేక బస్సులో తరలించారు. కంటి వైద్యులు డాక్టర్ ఎల్లారెడ్డి మాట్లాడుతూ ప్రతి మనిషికి కళ్ళు ఎంతో ప్రధానమైన వని అన్నారు. క్లబ్ అధ్యక్షులు కరణం హనుమంతరావు మాట్లాడుతూ పేద ప్రజలు ఈ సదవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి డాక్టర్ శివ చెన్నయ్య, సూపర్వైజర్ మదార్సా, ఆరోగ్య కార్యకర్తలు హిమబిందు, సతీష్ కుమార్, ఏసోబు, రోటరీ క్లబ్ సెక్రటరీ కాలేషావలి, ట్రెజరర్ గుర్రం ఆంజనేయులు, డిస్టిక్ ఛైర్మన్ చిలుకూరి వీర రాఘవయ్య, పెంట్యాల జగదీశ్వరరావు, వెంకట సుబ్బారావు, సుబ్బారావు, సుబ్బారావు పాల్గొన్నారు.

వినతి పత్రం అందజేస్తున్న న్యాయవాదులు

రిజిస్ట్రేషన్ చట్టం రద్దు చేయాలి

ప్రజాశక్తి : చీరాల

రాష్ట్ర ప్రభుత్వం 2023లో యాక్ట్ 27 ఆఫ్ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ 2023 అనే నూతన చట్టాన్ని అమలులోకి తీసుకువచ్చింది. ఈ చట్టంలో ఉన్న అనేక అంశాలు న్యాయ నిపుణులతో చర్చించకుండా, ప్రజాభిప్రాయం తీసుకో కుండా బిల్లు రూపంలో ఆమోదించారని, వెంటనే చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ న్యాయవాదులు గురువారం కోర్టు వద్ద నిరసన బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థిరాస్తుల విషయంలో తగాదాలు ఏర్పడితే పరిష్కరించే అధికారాన్ని సివిల్ కోర్టుల పరిధి నుండి ప్రభుత్వంచే ఏర్పాటు కానున్న జిల్లా స్థాయి ట్రిబ్యునల్‌కు అధికారాలు బదిలీ చేశారని బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి రమేష్ బాబు, కె చంద్రశేఖరరావు అన్నారు. ఈ చట్టం తక్షణమే చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వీరికి మద్దతుగా తెలుగుదేశం, జనసేన, సీపీఐ, సిపిఎం నాయకులు ఎల్ జయరాజు, డి నారపరెడ్డి సంఘీభావం తెలిపారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

ప్రజాశక్తి - భట్టిప్రోలు

తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటలను పరిశీలించేందుకు టిడిపి అధినేత చంద్రబాబు శుక్రవారం వేమూరు నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు మాజీ మంత్రి నక్కా ఆనందబాబు తెలిపారు. అమర్తలూరు మండలంలో దెబ్బతిన్న పంటలను ఆనందబాబు పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వ పరంగా తగిన ఆర్థిక సహాయం అందించే విధంగా చర్యలు తీసుకునేందుకు చంద్రబాబు పర్యటన ఉంటుందని అన్నారు. అమృతలూరు మండలం కూచిపూడి లాకు నుండి ప్రారంభమై పెదపూడి, అమర్తలూరు, గోవాడ వరకు చంద్రబాబు పంటలను పరిశీలిస్తారని పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 10గంటలకల్లా టిడిపి నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి ఒక్కరు కూచిపూడి లాక్ సెంటర్‌కు చేరుకొని చంద్రబాబు పర్యటనను అనుసరించాలని సూచించారు.

మాట్లాడుతున్న శిరీషా

తల్లిదండ్రుల పట్ల కృతజ్ఞతతో మెలగాలి

ప్రజాశక్తి-మార్కాపురం

విద్యార్థులు తల్లిదండ్రుల పట్ల కృతజ్ఞతతో మెలగాలని మహిళా పోలీస్ శిరీష, వికాస తరంగిణి సమన్వయ కర్తలు కొల్లి విజయలక్ష్మి, నారాయణం లావణ్య తెలిపారు. స్థానిక వాసవీ విద్యానికేతన్ స్కూల్‌లో గురువారం మోటివేషన్ క్లాసులు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ అండ్ ప్రిన్సిపల్ కె.రంగయ్య అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో వక్తలు మాట్లాడారు. గురువుల పట్ల విధేయతగా ఉండాలన్నారు. . ఏదైనా లక్ష్యం ఎంపిక చేసుకుని చదువులో రాణిస్తే ఉన్నతంగా జీవనం సాగించే అవకాశం ఉంటుందన్నారు. చెడు పనులకు దూరంగా ఉండాలని కోరారు. చదువుకునే వయసులో ఎలా నడుచుకోవాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్ర మంలో పాఠశాల ఎఒ రంజిత్‌కుమార్, ఉపాధ్యాయులు ు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యయత్నం ఘటనపై ఆరా తీసిన మంత్రి సురేష్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

కేసు విషయంలో పోలీసులు ఓ యువకుడిని స్టేషన్ పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. అవమానంగా భావించిన ఆ యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై రాష్ట్ర పురపాలక పట్టణాభివద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ గురువారం ఆరా తీశారు. పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడి ఘటన తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని కోరారు. బాధితుడు మోజెష్‌కు మెరుగైన వైద్యం అందించాలని, పూర్తిగా కోలుకునే వరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ ఘటనకు కారకులైన వారిని ఉపేక్షించేది లేదని మంత్రి హెచ్చరించారు. వైద్యాశాలలో చికిత్స పొందుతున్న మోజెష్ తల్లిదండ్రులతో మంత్రి సురేష్ ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని ధైర్యం చెప్పారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

సిపిఎం బృందం

ప్రజాశక్తి -కొండపి

తుపాను కారణంగా పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు కోరారు. సిపిఎం బృందం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో పర్యటించి వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలించింది. ఈ సందర్భంగా కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నష్టాన్ని అంచనా వేసి పంట నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని చెప్పటం తప్ప ఒక్క అడుగు ముందుకు పడలేదన్నారు. వారం రోజుల క్రితం వరకూ వర్షాలు లేక పంటలు సాగు చేయలేక, సాగు చేసిన పంటలు ఎండిపోతూ రైతులు ఇబ్బంది పడ్డారని చెప్పారు. మండలంలో 6 వేల ఎకరాల్లో పొగాకు సాగు చేయాల్సి ఉండ 4 వేల ఎకరాల్లో సాగు చేసినట్లు తెలిపారు. శనగ 6,100 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా కేవలం 1100 ఎకరాల్లో సాగు చేసినట్లు తెలిపారు. మిర్చి 600 ఎకరాల్లో సాగు చేసినటుల తెలిపారు. వర్షం కారణంగా శనగ పంట ఎక్కువ శాతం దెబ్బతిన్నట్లు తెలిపారు. పొగ మొక్కలు ఉరకెత్తున్నట్లు తెలిపారు. 210 ఎకరాల్లో వరి నేలకొరినట్లు తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేసి నివేదికలు అధికారులకు అందజేసి రైతులకు పరిహారం అందేలా చూడాలని కోరారు. శనగ రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సబ్సిడీపై అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కెజి.మస్తాన్, మండల నాయకులు గడ్డం పిచ్చయ్య,బాలసుబ్రహ్మణ్యం, సామేలు, నాని పాల్గొన్నారు.

తర్లుపాడు : వర్షం కారణంగా వరి, మిరప, ఇతర పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఎపి రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలను నాయకులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో దెబ్బతిన్న పంటలను పరిశీలించి నివేదికలు తయారు చేయాలన్నారు. ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం అందించాలన్నారు. పంటలను పరిశీలించిన వారిలో రైతు సంఘం నాయకుడు ఏరువా పాపిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు గుమ్మా బాలనాగయ్య, దేవిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, బత్తుల అల్లూరయ్య, రావి వెంకటరెడ్డి, కె.అల్లురెడ్డి, కంది రమణారెడ్డి తదితరులు ఉన్నారు

కొండపిలో పంట పొలాలను పరిశీలిస్తున్న సిపిఎం బృందం

బల్లికురవ రూరల్ : తుపాను కారణంగా పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు పరిహారం అందజేసి ఆదుకోవాలని సిపిఎం బందం కోరింది. మండల పరిధిలోని గుంటుపల్లి, బల్లికురవ ,గుంటుపల్లి ,నక్కబక్కలపాడు గ్రామాలలో వర్షం కారణంగా దెబ్బతిన్న పంటలను సిపిఎం బృందం గురువారం పరిశీలింది. ఈ సందర్భంగా సిపిఎం బృందం మాట్లాడుతూ మొక్కజొన్న. వరి, చెరుకు, ఇతర మెట్ట పంటలు వర్షం కారణంగా దెబ్బతిన్నట్లు తెలిపారు. ప్రభుత్వం రైతులకు నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. పంటలు దెబ్బతినడంతో కౌలు రైతులు నష్టపోయినట్లు తెలిపారు. కౌలు రైతులకు నష్టపరిహారం అందజేయాలన్నారు. పంటలను పరిశీలించిన వారిలో సిపిఎం మండల కార్యదర్శి,తంగిరాల వెంకటేశ్వర్లు మండల నాయకులు గొల్లపూడి అంజయ్య ,బి. వీరయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తర్లుపాడులో వరి పంటను పరిశీలిస్తున్న నాయకులు

బల్లికురవలో పంటలను పరిశీలిస్తున్న నాయకులు

ఆఫ్రికా నత్త

మార్కాపురంలో ఆఫ్రికా నత్తలు

ప్రజాశక్తి-మార్కాపురం

మర్కాపురంలో ఆఫ్రికా దేశానికి చెందిన నత్తలు దర్శన మిచ్చాయి. మున్సి పాలిటీకి చెందిన మాగుంట సుబ్బరామిరెడ్డి పార్కులో స్థానికులు ఈ నత్తలను గుర్తించారు. నత్తలు పచ్చదాన్ని ఆహారంగా తీసుకుంటున్నట్లు గమనించారు. నత్తలు సంచరిస్తున్న ప్రదేశంలో పచ్చదనం తరిగిపోతోంది. నత్తల సంతతి పెరిగితే పచ్చదనం కనిపించదని కొందరు అంటున్నారు. పర్యావరణానికి ఆఫ్రికా నత్తలు హానికరం చేస్తాయని ప్రచారం జరుగుతోంది. ఆఫ్రికా నత్తలతో పర్యావరణానికి హాని జరుగుతుందా లేదా అనే విషయంపై నిపుణులు అధ్యయనం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కందుల

మాజీ ఎంపిటిసి నాగరత్నమ్మ మృతి

మార్కాపురం : మండల పరిధిలోని రాయవరం మాజీ ఎంపిటిసి యద్దనపూడి నాగరత్నమ్మ (75) గురువారం మృతి చెందారు. ఆమె గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమె కుమారుడు యద్దనపూడి జయప్రకాష్ టిడిపిలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. ఈ విషయం గురించి తెలుసుకున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి నాగరత్నమ్మ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

టిడిపి కార్యకర్తలు..

ఐక్యంగా పని చేయాలి : దామచర్ల

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలోని టిడిపి నాయకుల్లో మనస్పర్థలు ఉంటే అవన్నీ పక్కన పెట్టి రానున్న ఎన్నికల్లో ఐక్యంగా పని చేసి గూడూరి ఎరిక్షన్‌బాబును గెలిపించుకుందామని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్ధన్ పిలుపునిచ్చారు. యర్రగొండపాలెంలో నూతనంగా నిర్మించిన టిడిపి కార్యాలయాన్ని గురువారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభకు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా దామచర్ల జనార్ధన్ మాట్లాడుతూ ఇప్పటికే యర్రగొండపాలెంలో టిడిపి మూడు పర్యాయాలు ఓడిపోయిందన్నారు. దీంతో చాలా నష్టపోయామని చెప్పారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా గూడూరి ఎరిక్షన్‌బాబు బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రతి గ్రామంలో పర్యటించి ప్రజలతో మమేకవుతున్నారన్నారు. ఇప్పటికే ఒక్కో గ్రామాన్ని రెండుసార్లు తిరిగి ప్రజలతో మంచి సంబంధాలు కలిగి ఉన్నారని తెలిపారు. ఇటీవల టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు యర్రగొండపాలెం వచ్చిన సందర్భంగా ఎరిక్షన్‌బాబును అభ్యర్థిగా ప్రకటించినట్లు గుర్తు చేశారు. జగన్‌రెడ్డి పాలనతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. తుపాను కారణంగా పంటలన్నీ నీట మునిగి రైతాంగం తీవ్ర నష్టాల పాలైతే పంటలను పరిశీలించాల్సిన ముఖ్యమంత్రి అధికారులతో సమీక్షలు నిర్వహించడం ఎంత వరకూ సబబన్నారు. నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టిడిపి ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, కనిగిరి మాజీ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే బిఎన్. విజయకుమార్, గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాచర్ల మాజీ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి, టిడిపి సీనియర్ నేత డాక్టర్ మన్నె రవీంద్ర, టిడిపి మండల కన్వీనర్ చేకూరి సుబ్బారావు, నాయకులు యూసూఫ్, మస్తాన్‌వలి, చిట్టేల వెంగళరెడ్డి, శనగా నారాయణరెడ్డి, తోటా మహేష్ నాయుడు, పయ్యావుల ప్రసాద్, షేక్ వలి, ఇస్మాయిల్, వలరాజు, షేక్ మాబు, మల్లికార్జునరెడ్డి, బట్టు సుధాకర్‌రెడ్డి, అంబటి వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్

అన్ని రైళ్లనూ పునరుద్ధరించాలి : మాగుంట

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

కోవిడ్ ప్రభావంతో ఒంగోలు పార్లమెంట్ పరిధిలో నిలిపివేసిన అన్ని రైళ్లను పునరుద్ధరించాలని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి కోరారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న పార్లమెంట్ సమావేశంలో మాగుంట రూల్ 377లో మాట్లాడుతూ కోవిడ్ ప్రభావంతో ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఒంగోలు, శింగరాయకొండ, దొనకొండ రైల్వే స్టేషన్లలో పలు రైళ్లను నిలుపుదల చేశారన్నారు. తగినన్ని ఎక్ష్ ప్రెస్ రైళ్ళు లేక ప్రజలు, విద్యార్థులు, వ్యాపారస్తులు అనేక విధాలుగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిలుపుదల చేసిన రైళ్లను పునరుద్ధరించి అదనంగా కొత్త ఎక్స్‌ప్రెస్ రైళ్లను కూడా నడపాలని ఎంపీ కోరారు.

కళాశాలలో మధ్యాహ్న భోజనం ప్రారంభం

ప్రజాశక్తి-చీమకుర్తి

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బూచేపల్లివెంకాయమ్మ సుబ్బారెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లివెంకాయమ్మ గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టడం సంతోషంగా ఉందన్నారు.మాజీ ఎమ్మెల్యే బూచేపల్లిసుబ్బారెడ్డి ఆశయాల కనుగుణంగా అన్నదానం సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు.విద్యార్థులకు తమ ట్రస్టు ద్వారా నెల రోజులపాటు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.లయన్స్‌క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బి. జవహర్ మాట్లాడుతూ విద్యార్థులకు మధ్యాహ్నభోజనం అందించడం ద్వారా వారు చదువుపై దృష్టి సారించి మంచి ఫలితాలు సాధించే అవకాశాలు ఉన్నాయన్నారు.ఈ కార్యక్రమంలో ఒంగోలు గెలాక్సీ అధినేత చలువాది బదరీ నారాయణ, కళాశాల ప్రిన్సిపల్ ఆలీబాబు, కౌన్సిలర్లు ఎస్‌కె.ఖాజా,ఇందిర పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభిస్తున్న బూచేపల్లి

మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే స్వామి

దళిత, గిరిజనులను మోసం చేసిన జగన్ : స్వామి

ప్రజాశక్తి-శింగరాయకొండ

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దళిత, గిరిజనులు మోసం చేశారని ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. మూలగుంటపాడు గ్రామపంచాయతీ పరిధిలోని అమరావతి రోడ్ లో బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం గురువారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు హయాంలో ప్రభుత్వం గిరిజనులకు అన్ని విధాలుగా అండగా నిలిచినట్లు తెలిపారు. దళితులకు చంద్రబాబు నాయుడు అమలు చేసిన పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చీమకుర్తి కష్ణ, కూనపు రెడ్డి వెంకటసుబ్బారావు, సన్నె బోయిన శ్రీనివాసులు నాయుడు, కనిగిరి వెంకటేశ్వర్లు , ఎస్కె. సంభాని బాషా, ఇమ్మడిశెట్టి రామారావు, నరాల సుధాకర్ , బసవయ్య, చంటి, సుదర్శి ప్రసాదరావు, కోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

టంగుటూరు : ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంట ఉత్పత్తులు మానవ ఆరోగ్యానికి మేలు చేస్తాయని వ్యవసాయ శాస్త్రవేత్త సద్గుణ తెలిపారు. మండల పరిధిలోని కందులూరు గ్రామంలో మహిళా రైతు మన్నం రజని సాగు చేస్తున్న ప్రకతి వ్యవసాయాన్ని శాస్త్రవేత్తలు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ భూమిలో ఉండే పంటలకు కీడు చేసే పురుగులతో ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రకతి వ్యవసాయంలో ఉండే మొక్కలకు రక్షణగా పొలంలో ఉండే పురుగులు వీటిని కాపాడు తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎల్ వన్ రంజిత్ కుమార్, ఎల్ 2 విజయలక్ష్మి, గ్రామ నాయకులు మన్నం వెంకయ్య, వ్యవసాయ సహాయకులు సుజాత, మరియమ్మ, శతి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ప్రజాసంకల్ప వేదిక.. రాష్ట్ర జనరల్ సెక్రెటరీగా రవి నాయక్

యర్రగొండపాలెం : ప్రజాసంకల్ప వేదిక రాష్ట్ర ఆర్‌టిఐ జనరల్ సెక్రెటరీగా మండల పరిధిలోని పిల్లికుంటకు చెందిన దేశావత్ రవి నాయక్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా రవినాయక్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005ను ఉపయోగించుకొని చైతన్యవంతంతో రాజ్యాంగం ఇచ్చిన, హక్కులను, చట్టాలను ఉపయోగించుకుంటూ సమస్యలను శాశ్వతంగా పరిష్కారం చేసుకునే విధంగా ప్రజలకు చైతన్యం కలిగిస్తానని తెలిపారు. పశ్చిమ ప్రాంతంలో సంకల్ప వేదికను బలోపేతం చేస్తామన్నారు. గిరిజన ప్రజల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

వికలాంగుల హక్కుల కోసం పోరాటం

పుల్లలచెరువు : వికలాంగుల హక్కుల కోసం నిరంతరం పోరాటం సాగించాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్మా రాజయ్య పిలుపునిచ్చారు. వికలాంగుల దినోత్సవ వారోత్సవాల సభ నియోజకవర్గ అధ్యక్షులు పోలేపల్లి పెద్ద పాలంకయ్య అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ వికలాంగులకు నెలకు రూ.6000 పెన్షను ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి చేదూరి సుధాకర్, ప్రధాన కార్యదర్శి కనమాల కోటేశ్వరరావు, అంధ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు బుదాల చిన్నయ్య, మండల అధ్యక్షుడు దోరెడ్ల ఏసోబు, నాయకులు బాల నరసయ్య, శ్రీను, బాలకోటి, కోటయ్య, గోపాలకష్ణ, వేకటేశ్వర్లు, చెన్నయ్య పాల్గొన్నారు

పెండింగ్ క్లెయిమ్స్‌ను పూర్తి చేయాలి

ఆర్‌డిఒ విశ్వేశ్వరరావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో పెండింగ్ క్లెయిమ్స్‌ను వెంటనే పూర్తి చేయాలని ఆర్‌డిఒ విశ్వేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఆర్‌డిఒ కార్యాలయంలో గురువారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ ప్రస్తుతం ఒంగోలు నియోజకవర్గానికి సంబంధించి 11,708 పెండింగ్ క్లెయిమ్స్ ఉన్నాయన్నారు. అందులో ఫారం-6 క్లెయిమ్స్ 3,137, ఫారం-7 క్లెయిమ్స్ 4,354, ఫారం-8 క్లెయిమ్స్ 4,203, ఫారం 6ఏ క్లెయిమ్స్ 14 ఉన్నాయని వాటిని వెంటనే బిఎల్‌ఒలు, సూపర్ వైజర్లు పూర్తి చేయాలని కోరారు. ఓటర్ల జాబితా 2024 జనవరి 5 న విడుదల చేస్తామని తెలిపారు. నియోజకవర్గం లోని 259 పోలింగ్ స్టేషన్ లలో అర్హత ఉన్న ప్రతి ఒక్క ఓటరు ఫారం 6 ద్వారా కొత్త ఓట్లు చేర్చుకోవటానికి, ఫారం 7లో డబుల్ ఓట్లు తొలిగించటం, ఫారం 8లో ఓట్లు ఒక చోటు నుంచి మరొక చోటుకు మార్చటానికి, ఫారం 6ఏలో ఆధార్ అనుసంధానం చేసుకోవటానికి ఎన్నికల సంఘం ఈనెల 9 వరకూ అవకాశం కల్పించిందన్నారు. అభ్యంతరాలు ఉంటే ఈ నెల 23 లోపు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు తహశీల్దారు పి.మురళి, వైసిపి రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి దామరాజు క్రాంతికుమార్, టిడిపి ప్రతినిధి కటారి సంజయ్, స్వరూప్, బిజెపి ప్రతినిధులు బసినేపల్లి రాజశేఖర్, గుర్రం సత్యం ,కాంగ్రెస్ ప్రతినిధి ఎస్కె.రసూల్. సిపిఎం నాయకులు రమేష్ సూపవైజర్లు, బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్‌డిఒ విశ్వేశ్వరరావు

పులి వెంకటరెడ్డికి నివాళి

ప్రజాశక్తి-కనిగిరి

కేంద్ర కార్మిక శాఖ మాజీ మంత్రి పులి వెంకటరెడ్డి 23వ వర్ధంతి కుటుంబ సభ్యులు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పులి వెంకటరెడ్డి పార్కులోంకటరెడ్డి మనవరాలు, మున్సిపల్ వైస్ చైర్మన్ పులి శాంతి, గోవర్ధన్ రెడ్డి దంపతులు, పులి లక్ష్మి , 17వ వార్డు కౌన్సిలర్ దేవకి రాజీవ్ తదితరులు వెంకటరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పులి వెంకటరెడ్డి వెలిగండ్ల సమితి ప్రెసిడెంట్ గా. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా, మూడుసార్లు పార్లమెంట్ సభ్యునిగా, కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా పనిచేశారని ఆయన సేవలను కొనియాడారు. ప్రధానంగా వెనుకబడిన ప్రకాశం జిల్లా అభివృద్ధి ఎంతోగానే కృషి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పులి నాగేంద్ర,రుద్ర,సందాని, పాచ్చు, మన్సూర్, భారత్ గ్యాస్‌ఏజెన్సీ సిబ్బంది పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న కుటుంబసభ్యులు

నవనీతమ్మ సేవలు చిరస్మరణీయం : అశోక్‌బాబు

ప్రజాశక్తి-టంగుటూరు

ఎంపిటిసి తొట్టెంపూడి నవనీతమ్మ సేవలు చిరస్మరణీయమని వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు తెలిపారు. మండల పరిధిలోని కాకుటూరువారిపాలెంలో ఎంపిటిసి నవనీతమ్మ సంస్మరణ సభ గురువారం నిర్వహించారు. ఈ సభలో అశోక్‌బాబు పాల్గొని నవనీతమ్మ కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం జమ్మలపాలెంలో వైసిపి యువ నాయకుడు బెజవాడ సురేష్ తల్లి సరోజనమ్మ అనారోగ్యంతో మరణించగా ఆమె భౌతికాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అదేవిధంగా బుచ్చిరాజుపాలెంలో దుగ్గిరాల కిరణ్ సంస్మరణ సభకు హాజరై కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అశోక్ బాబు వెంట జెసిఎస్ మండల కన్వీనర్ చింతపల్లి హరిబాబు, ఎఎంసి డైరెక్టర్ టంగుటూరి రామకష్ణ, నాయకులు సూదనగుంట వెంకటస్వామి, బొడ్డు రవీంద్ర, గుండెపరెడ్డి శ్రీహరిరెడ్డి,. వైసిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి,ఎస్‌టి అట్రాసిటీ కేసులపై విచారణ

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలంలో ఇటీవల నమోదైన ఎస్‌సి,ఎస్‌టి అట్రాసిటీ కేసులను ఒంగోలు డిఎస్‌పి వి. నారాయణస్వామి రెడ్డి గురువారం విచారించారు. తొలుత పంచాయతీ కార్మికుడు నరసింహపై దాడి ఘటనలో నమోదైన ఆట్రాసిటీ కేసులోనిసాక్షులను విచారించారు. అనంతరం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం కొండపి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాపూరి ప్రభావతి కేసుకు సంబంధించిన తిరుమల పట్టాభినగర్‌కు వెళ్లి విచారించారు. అనంతరం బింగినపల్లిలో ఇటీవల గిరిజన బాలికపై జరిగిన గ్యాంగ్ రేప్ గురించి విచారించి వివరాలు సేకరించారు. డిఎస్‌పి వెంట సిఐ దాచేపల్లి రంగనాథ్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

బాధితుడికి న్యాయం చేయాలి

గ్రామపంచాయతీ కార్మికుడు నరసింహపై జరిగిన దాడి ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధితుడికి న్యాయం చేయాలని సిఐటియు నాయకులు టంగుటూరి రాము, కెవిపిఎస్ నాయకులు వేసుపోగు మోజెస్, ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు రావినూతల కోటి మాదిగ తదితరులు డిఎస్‌పిని కోరారు.

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డిఎస్‌పి

చర్చల్లో పాల్గొన్న నాయకులు, కార్మికులు

కార్మికుల చర్చలు సఫలం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు 18 నెలలగా జీతాలు పెండింగ్ ఉన్నాయి. దీంతో పంచాయతీ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో గురువారం విధులకు హాజరు కాలేదు. అనంతరం అంబేద్కర్ బొమ్మ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. వేతనాలు పంపిణీ చేయాలని నినాదాలు చేశారు. దీంతో పంచాయతీ కార్యదర్శి ఈదుల రాజశేఖర్‌రెడ్డి సిఐటియు నాయకులతో చర్చలు జరిపారు. చర్చల్లో భాగంగా 12 నెలల వేతనాలు ఇచ్చేందుకు అంగీకరించారు. ముందుగా క్రిస్మస్ పండుగ సందర్భంగా కార్మికులకు ఒక్కొక్కరికి రూ. 40 వేలు, స్వచ్ఛ భారత్ కార్మికులకు ఒక్కొక్కరికి రూ. 10 వేలు చొప్పున చెల్లించేందుకు అంగీకరించారు. దీంతో చర్చలు సఫలమయ్యాయి.ఈ చర్చల్లో సిఐటియు నాయకులు పల్లె జాన్, బంగారయ్య, వైసిపి మండల కన్వీనర్ కొప్పర్తి చిన్న ఓబుల్‌రెడ్డి, మాజీ ఎంపిపి బాల గురవయ్య, వైసిపి నాయకులు వెంకటేశ్వరరెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనులు వేగవంతం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలో 2009వ సంవత్సరంలో రూ. 20 లక్షలు నిధులతో శ్రీశక్తి భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆ నిధులు సరిపోక మరో రూ. 10 లక్షలు కేటాయించారు. అయినప్పటికీ అప్పటి నుంచి ఇప్పటి వరకూ భవనం మాత్రం అందుబాటులోకి రాలేదు. దాన్ని కొంత కాలం పాటు సిమెంట్ గోదాముగా ఉపయోగించారు. ఇప్పటి వరకూ అద్దె గదుల్లోనే వైఎస్సార్ క్రాంతి పథం కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ ఆదేశాలతో యర్రగొండపాలెం మండల పరిషత్ నిధులు నుంచి రూ. ఆరు లక్షలు కేటాయించారు. ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్ భవన నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నాగేశ్వర ప్రసాద్, వైఎస్ఆర్ క్రాంతి పథం ఎపిఎం అడ్వర్డ్, వైస్ ఎంపిపి ఆదిశేషు, గంజివారిపల్లి సర్పంచి దుగ్గెంపూడి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి గుమ్మా పద్మజ యల్లేష్ చేతుల మీదుగా ఆడుదాం ఆంధ్ర కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర ద్వారా విద్యార్థుల్లో ఉత్సాహం, ఉల్లాసం కలుగుతుందన్నారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి, కటకానివానిపల్లి సర్పంచి పిక్కిలి కోటిలింగం, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్ద దోర్నాలలోని జీసస్ హీలింగ్ టెంపుల్ ఫౌండర్, డైరెక్టర్ సింగా ఏసన్న ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో దోర్నాల మేజర్ పంచాయతీ సర్పంచి చిత్తూరి హారిక పాల్గొని అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జీసస్ లవ్స్ మినిస్ట్రీస్ ఫౌండర్, డైరెక్టర్ గుర్రం శేఖర్, జీసస్ హీలింగ్ టెంపుల్ ట్రెజరర్ హెప్సీబారాణి, పాస్టర్స్ యూనియన్ ప్రెసిడెంట్ సింగ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని ఐలవరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను అమర్తలూరు సిడిపిఒ విజయలక్ష్మి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. గ్రామంలోని సాతానం వారివీధి, ఎస్సీ, ఎస్టీ ఏరియాలో (6) కేంద్రాల రికార్డులు పరిశీలించారు. ప్రీ స్కూల్ విద్యార్థులతో మాట్లా డారు. పాటలు, కథలు వంటి వివరాలు అడిగి తెలుసు కున్నారు. పిల్లలచే పలు రకాల కథలను చెప్పించి తగిన సూచనలు చేశారు. గర్భిణీ, బాలింతలకు అందించే పౌష్టికాహార రికార్డులను తనిఖీ చేశారు. సక్రమంగా అంద యో లేదోనని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్య కర్తలు డి రత్నకుమారి, సామర్ల శివనాగలక్ష్మి ఉన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న సిడిపిఒ

నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఎంపిపి శ్రీకృష్ణయ్య

నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి - నగరం

తుఫానుతో నష్టపోయిన పేదలకు ఎంపిపి చింతల శ్రీకృష్ణయ్య నిత్యావసర సరుకులు గురువారం పంపిణీ చేశారు. మండలంలోని ఈదుపల్లి గ్రామ ఎస్టీ కాలనీలో సిఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు బియ్యం పంపిణీ చేశారు. ఒక్కొక్క కుటుంబానికి 25కేజీల బియ్యం, కేజీ పామాయిల్, కేజీ కందిపప్పు, కేజీ బంగాళ దుంపలు, కేజీ ఉల్లిపాయలు పంపిణీ చేశారు. మండలంలో 249కుటుంబాలకు పంపిణీ చేసినట్లు తహశీల్దారు ఎం ప్రమీల తెలిపారు. కార్యక్రమంలో ఈదుపల్లి సర్పంచ్ చింతల పవన్ కుమార్, మీసాలవారిపాలెం సర్పంచ్ చింతల సుబ్బారావు పాల్గొన్నారు.?

పంట నష్టపరిహారం అందించాలి

ప్రజాశక్తి - రేపల్లె

తుఫాను ప్రభావంతో నష్టపోయిన రైతులకు వెంటనే ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని నల్లూరుపాలెం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరవల్లి శివరామ కృష్ణ డిమాండ్ చేశారు. గతంలో అకాల వర్షాల కారణంగా ధాన్యం రైతులు తీవ్రంగా నష్టపోయినా ప్రభుత్వం తగు రీతిలో స్పందించ లేదని అన్నారు. ధాన్యం కొనుగోలులో రకరకాల ఆంక్షలతో ఇప్పటికీ రైతులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. సమస్య వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలులో ఆంక్షలు తొలగించాలని కోరారు.

తడిసిన పంటలు పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి - అమర్తలూరు (చెరుకుపల్లి)

మండలంలోని వివిధ గ్రామాల్లో ఏడిఎ, డాట్ శాస్త్రవేత్తల బృందం పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. తురుమెళ్ళ, ఇంటూరు, మోపర్రు గ్రామాలలో పర్యటించి దెబ్బతిన్న వరిని పరిశీలించారు. పొలంలో నీళు తీసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బాపట్ల ఏడిఎ, డాక్టర్ ఓబయ్య, డాక్టర్ రాధాకృష్ణ, ఎఒ ఉయ్యూరు లోకేశ్వరి పాల్గొన్నారు.

వైట్‌బర్లీ రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - అద్దంకి

మిర్చి రైతులతో ఎమ్మెల్యే గొట్టిపాటి రవి

బర్లీ పొగాకు పంటను ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ గురువారం పరిశీలించారు. పండించిన బర్లీ పొగాకును ఎండబెట్టేందుకు పందిళ్ళు వేశారు. రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షం, తీవ్ర గాలులకు పందిళ్ళు పడిపోయాయి. పొగాకు మొత్తం తడవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. రైతును అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఖరీఫ్‌లో నీటి వసతి లేకపోయినా ఆయిల్ ఇంజన్ల ద్వారా అధిక ఖర్చులు భరించి పొగాకు పంట సాగు చేశామని, చేతికందే దశలో తడిసి నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మొదటి కోత అయిపోయి పందిల్లకి కట్టి ఎండ పెట్టే సమయంలో అకాల వర్షంతో రంగు మారి ఆకుపై మచ్చ ఏర్పడి, ముడత వచ్చి పూర్తిగా నష్టాన్ని నింపిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ విపత్తుల వేళ ప్రభుత్వం చేతులెత్తేయడం దారుణమని అన్నారు. తుఫాను హెచ్చరికల నేపథ్యంలో ప్రభుత్వం ముందస్తుగా ఎటువంటి నష్ట నివారణ చర్యలు చేపట్టకపోవడం దుర్మార్గమని అన్నారు. రూ.లక్షలు అప్పులు చేసి పంటలపై పెట్టుబడులు పెట్టిన రైతన్న ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. వ్యవసాయ అధికారులు వెంటనే పంట గణన చేపట్టి పొగాకు రైతుకు ఎకరాకు రూ.50వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పంగులూరు : తుఫాను ధాటికి దెబ్బతిన్న పంటలను ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పరిశీలించారు. మండలంలోని జనకవరం, కొండమూరు, చందలూరు గ్రామాల్లో దెబ్బతిన్న మిర్చి, మొక్కజొన్న, పొగాకు, శనగ పంట పొలాలను పరిశీలించి వ్యవసాయ అధికారితో ఫోనులో మాట్లాడారు. మిర్చి, శనగ, మినుము, మొక్కజొన్న, తదితర ఉద్యానవన, వాణిజ్య పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని చెప్పారు. పంట నష్టం నష్టగణన త్వరితగతిన చేపట్టాలని కోరారు. దెబ్బతిన్న ప్రతి ఎకరాకు నష్టపరిహారం అందించాలని కోరారు. కౌలు రైతుల పేరు మీదే ఈ-క్రాప్ నమోదు చేసి నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని చెప్పారు. ప్రభుత్వం నిర్లక్ష్యమే రైతులను నట్టేట ముంచిందని ఆరోపించారు. చేతికి అందిన పంట కాపాడుకునేందుకు కనీసం సహాయం చేయాలన్న ఆలోచన ప్రభుత్వం చేయలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. వేలాది ఎకరాల్లో పూర్తిస్థాయిలో దెబ్బతిన్నాయని అన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు రైతులకు ప్రత్యేక బడ్జెట్ పెట్టి ఆదుకున్నట్లు గుర్తు చేశవారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు రావూరి రమేష్ బాబు, మాజీ జెడ్పిటిసి కర్రీ వెంకట సుబ్బారావు, గుర్రం ఆదిశంకర్, కుక్కపల్లి ఏడుకొండలు, చింతల సహదేవుడు, ఎఒ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రైతులను ఆదుకుంటాం : బాచిన

అరటి తోట రైతులతో మాట్లాడుతున్న కృష్ణచైతన్య

ప్రజాశక్తి - సంతమాగులూరు

తుఫాను కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకునే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాని వైసీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య అన్నారు. మండలంలోని కొమ్మాలపాడు, మక్కెనవారిపాలెం, ఏల్చూరు, సజ్జాపురం గ్రామాలలో వర్షానికి దెబ్బతిన్న మిర్చి, వరి, అరటి, మొక్కజొన్న పంటలను అధికారులతో కలిసి పరిశీలించారు. అన్ని విధాలుగా రైతులకు ప్రభుత్వం నుండి రావలసిన పంట నష్ట పరిహారం అందే విధంగా సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని చెపపారు. కార్యక్రమంలో కొమ్మాలపాడు సర్పంచి మోతాదు మహబూబ్ జానీ, ఖాదర్ మస్తాన్, జడ్పిటిసి అడవి శ్రీనివాసరావు, వైసీపీ మండల కన్వీనర్ చింతా రామారావు, డి గాలెయ్య పాల్గొన్నారు. మండలంలోని ఏల్చూరు గ్రామంలోని ఎస్టీ కుటుంబాలకు ఇండ్ల స్థలం పట్టాలు సిద్ధం చేయాలని తహశీల్దారు టీ ప్రశాంతిని వైసీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య ఆదేశించారు. తుఫాన్ దాటికి వర్షపు నీరు చేరి గుడిసెలు కూలిపోవడంతో ఆ కుటుంబాలు అనాధలుగా మిగిలారు. గ్రామానికి చెందిన హెల్పింగ్ హాండ్స్ సంస్థ సభ్యులు బాధితులకు దుస్తులు, ఆహారం అందించారు. పట్టాలి ఇచ్చిన వెంటనే పక్కా గృహాలు కూడా కట్టిచ్చిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మాజీ సొసైటీ అధ్యక్షులు డి గాలెయ్య, బండారు సాంబయ్య బాధితులకు ఏర్పాటు చేసిన భోజనాలను వడ్డించారు. కార్యక్రమంలో తహశీల్దారు టీ ప్రశాంతి, జడ్పిటిసి అడవి శ్రీనివాసరావు, వైసీపీ మండల కన్వీనర్ చింతా రామారావు పాల్గొన్నారు.

పర్చూరు : తుఫాను దాటికి నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని వైసీపీ ఇంచార్జి ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. సిఎంతో మాట్లాడి దెబ్బతిన్న పంట పొలాలకు ఎక్కువ నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. మండలంలో వరద ముంపుకి గురైన ప్రాంతాలను ఆయన గురువారం సందర్శించారు. ఉప్పుటూరు, వీరన్నపాలెం, పోతుకట్ల, రమణాయపాలెం, చెరుకూరు, భూషాయపాలెం, గొల్లపూడి, తిక్కరాజుపాలెం, అడుసుమల్లి, చిన్ననందిపాడు గ్రామాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. వీరన్నపాలెంలో ముంపుకి గురైన ఎస్సి కాలనీని పరిశీలించారు. నిత్యావసర సరుకులు అందించాలని అధికారులను ఆదేశించారు. గొల్లపూడిలో నీట మునిగిన మిర్చి పంటను పరిశీలించారు. పంట నష్టం జరిగిందో అంచనా వేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఈ క్రాప్ చేయించకపోయినా నష్టపోయిన రైతులందరికీ పరిహారం ఇవ్వన్నట్టు తెలిపారు. అందరికి నష్టపరిహారం వర్తించేలా సిఎంతో మాట్లాడతానని రైతులకు భరోసా ఇచ్చారు. ఆయన వెంట ఎడిఎ మోహనరావు, ఎఒ రామ్మోహనరెడ్డి, ముప్పాళ్ళ రాఘవయ్య, సర్పంచులు రామకృష్ణ, సుబ్బారావు, ఉప్పుటూరు సర్పంచ్ తిరుమలేశ్వరరావు, ఆకుల హేమంత్, గాదె సురేష్, జంగా అనిల్, దండమూడి రత్తయ్య, షేక్ కరీముల్లా, చంద్రం పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఆమంచి కృష్ణమోహన్

విద్యుత్తు సరఫరా పునరుద్ధరణ

అద్దంకి : మిచౌంగ్ తుఫాన్‌కు దెబ్బతిన్న విద్యుత్ స్థంభాల స్థానంలో కొత్త స్థంభాలు ఏర్పాటు చేసి విద్యుత్తు పునరుద్ధరించినట్లు ఎపిసిపిడిసిఎల్ ఇఇ మస్తాన్‌రావు తెలిపారు. విద్యుత్ సబ్ డివిజనల్ పరిధిలోని 7మండలాల్లో 31సబ్ స్టేషన్ ఉన్నట్లు తెలిపారు. వాటిలో 18సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో పూర్తిగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగినట్లు తెలిపారు. తుఫాను కారణంగా తమ శాఖకు రూ.20లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపారు. సిపిడిసిఎల్ సిఎండి పద్మ జనార్ధన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రకాశం జిల్లా విద్యుత్ ఎస్ఈ కెవిజి సత్యనారాయణ సహకారంతో డివిజనల్ పరిధిలోని విద్యుత్ అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో యుద్ధప్రాతి పదికన స్తంభాలు తొలగించి కొత్త విద్యుత్ సంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించినట్లు తెలిపారు

ఎన్‌టిఆర్ విగ్రహవ వద్ద టిడిపి నేతల ఆందోళన

టిడిపి నాయకుల రాస్తారోకో

ప్రజాశక్తి - బాపట్ల

టిడిపి విజయం సాధిస్తుందన్న విశ్లేషణలు జీర్ణించుకోలేక వైసిపి నాయకులు మండలంలోని భర్తిపూడి గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ధ్వంసం చేశారని టిడిపి ఇన్‌చార్జి వేగేశన నరేంద్ర వర్మ ఆరోపించారు. భర్తిపూడి గ్రామంలో జరిగిన సంఘటనపై అప్పికట్ల సెంటర్లో టిడిపి కార్యకర్తలతో కలిసి గురువారం రాస్తా రోకో చేశారు. గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహం ధ్వంసం సంఘటనపై ఎంఎల్ఎ కోన రఘుపతి నైతిక బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. ప్రశాంతమైన సంస్కృతికి ఉన్న భర్తిపూడి వంటి గ్రామాల్లో ఈ విధమైన చర్యలను ప్రోత్సహించి ప్రజల మధ్య చిచ్చుపెట్టి విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నాన్ని తిప్పి కొట్టాలని అన్నారు. వైసిపి నాయకులు ఇలాంటి దుశ్చర్యలు మానుకోకుంటే తగిన మూల్యం చెల్లిస్తారని హెచ్చరించారు. తుఫాను ప్రభావంతో పంటలు నష్ట పోయిన రైతులకు సాయం అందించడం చేతకాక ఆ అంశాన్ని ప్రక్కదారి పట్టించేందుకు ఇలాంటి దుశ్చర్యకు పాల్పడ్డారని అన్నారు. రాస్తారోకోతో గుంటూరు - చీరాల వైపు వెళ్లే వాహనాలు పెద్ద సంఖ్యలో నిలిచిపోయాయి.

ఎన్‌టిఆర్ విగ్రహవ వద్ద ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

క్లూస్ టీం పరిశీలన

ప్రజాశక్తి - బాపట్ల

మండలంలోని భర్తీపూడి గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహ ధ్వంసం కేసులో గురువారం క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరిస్తున్నట్లు రూరల్ సీఐ వేణుగోపాలరెడ్డి తెలిపారు. ఎన్టీఆర్ విగ్రహం ధ్వంసంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్షతగాత్రులను వైద్యశాలకు తరలింపజేస్తున్న గొట్టిపాటి రవి

మానవత్వం చాటుకున్న 'గొట్టిపాటి'

ప్రజాశక్తి - అద్దంకి

ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ మానవత్వం చాటుకున్నారు. పట్టణంలోని పలు కార్యక్రమాలకు హాజరైన ఆయన సంతమాగులురు వైపు వెళ్తున్న సమయంలో దామావారిపాలెం సమీపంలోని బజాజ్ షోరూం వద్ద రోడ్డుపై ప్రమాదం జరిగి ఉండటాన్ని గమనించారు. ఎమ్మెల్యే వెంటనే కారు ఆపి ఘటనా స్థలికి వెళ్లారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరిని లారీ ఢీకొనడంతో గాయాలై పడి ఉన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు 108కు సమాచారం ఇచ్చారు. అప్పటికే ప్రమాదం జరిగి 20నిమిషాలైనా 108అంబులెన్స్ రాలేదని స్థానికులు చెప్పడంతో పరిస్థితి గమనించిన గొట్టిపాటి తన వ్యక్తిగత సిబ్బంది ప్రైవేట్ అంబులెన్స్‌ను పిలిపించి ఆస్పత్రికి తరలించారు. స్థానిక ప్రభుత్వ వైద్యులతో ఫోనులో మాట్లాడి క్షతగాత్రుల ఆరోగ్య పరిస్తితి గురించి అడిగారు. అధిక రక్తస్రావం జరగడంతో ఒకరు చనిపోయారని, మరొకరికి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించనున్నట్లు వైద్యులు ఎమ్మెల్యే కు వివరించారు.

నేడు, రేపు చంద్రబాబు పర్యటన

వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిశీలన

ప్రజాశక్తి-బాపట్ల

వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించేందుకు తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఈ నెల ఎనిమిదిన బాపట్లకు విచ్చేయ నున్నట్లు ఆ పార్టీ బాపట్ల నియోజకవర్గ బాధ్యులు వేగేశన నరేంద్రవర్మ వెల్లడిం చారు. బాపట్ల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి, జనసేన నాయకులతో కలిసి గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తుపాను కారణంగా బాపట్ల ప్రాంతంలో దెబ్బతిన్న పంటపొలాలను పరిశీలించేందుకు చంద్రబాబు నాయుడు శుక్రవారం బాపట్ల జిల్లాకు విచ్చేస్తున్నారని చెప్పారు. వేమూరు, తెనాలి, బాపట్ల నియోజకవర్గాల్లో చంద్రబాబు పర్యటిస్తారన్నారు. రాత్రికి బాపట్ల తెలుగుదేశం

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

పార్టీ కార్యాలయ ఆవరణలో చంద్రబాబు బస చేస్తారని చెప్పారు. శనివారం పర్చూరు, పత్తిపాడు నియోజకవర్గాల్లో చంద్రబాబు పర్యటిస్తారని వివరించారు. సమావేశంలో సలగల రాజశేఖర్ బాబు, చుండూరుపల్లి శివ, జనసేన నాయకులు గోగన ఆదిశేషు, గొలపల శ్రీనివాసరావు, అప్జల్, ఏపూరి భూపతిరావు, విన్నకోట వీరయ్య నాయుడు పాల్గొన్నారు.

శరీర ఆరోగ్యంపై అవగాహన అవసరం

జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ప్రజాశక్తి-చీమకుర్తి

మారుతున్న జీవనశైలి వల్ల కౌమారదశలోని బాలి కలు తమ శరీరారోగ్యంపై అవగాహన కల్గి ఉంటే భవిషత్తులో ఆరోగ్య సమ స్యలు తలెత్తకుండా నివారిం చవచ్చని జిల్లాపరిషత్ ఛైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పేర్కొన్నారు. స్థానిక బూచేపల్లి ఇంజీరింగ్ కళాశాలలో గురువారం జెవివి మండల శాఖ ఆధ్వర్యంలో జరిగిన కౌమారదశలోని బాలికల ఆరోగ్య అవగాహనా సదస్సులో ఆమె మాట్లాడారు. జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ బి జవహర్ మాట్లాడుతూ ఆడపిల్లలు ఎదిగేక్రమంలో శారీరకంగా వస్తున్న మార్పులను అవగాహన చేసుకుంటూ.. తగిన పోషకాహారం తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. డాక్టర్ బి.శారద, డాక్టర్ సంధ్య మాట్లాడుతూ రక్తహీనత, రుతుచక్ర

మాట్లాడుతున్న జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

సమస్యలు, ప్రత్యుత్పత్తి వ్యవస్థపై ప్రభావం చూపుతుందన్నారు. బాలికలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలున్నా, సందేహాలున్నా స్థానిక జవహర్ నర్సింగ్‌హోంలో ఉచిత ఓపి సౌకర్యం ఉందన్నారు. ఈ సందర్భంగా 300 మందికి జెవివి ఆధ్వర్యంలో ఉచిత ఓపి కార్డులను విద్యార్థినులకు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కోఆర్డినేటర్ చలువాది బదరీనారాయణ, జెవివి ప్రధాన కార్యదర్శి చలువాది రమేష్, ప్రిన్సిపాల్ కోటిరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సకు మించి వైద్యం చేస్తే

ఆర్‌ఎంపీలపై క్రిమినల్ కేసు

డిఎంహెచ్ఒ రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి-శింగరాయకొండ

వైద్యాన్ని వ్యాపారంగా చేసి పేద ప్రజలతో ఆడుకోవద్దని జిల్లా వైద్యాధికారిని డాక్టర్ ఎస్ రాజ్యలక్ష్మి సూచించారు. ప్రథమ చికిత్సకు మించి వైద్యం చేస్తే ఆర్‌ఎంపీలపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గురువారం నాడు శింగరాయకొండలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రులపై డిఎంహెచ్ఒ ఆకస్మిక దాడులు చేశారు. కొన్ని ఆసుపత్రులను పరిశీలించి.. చిన్న చిన్న సమస్యలను సరిచేసుకోవాలని సూచించారు. సివిఆర్ ఆసుపత్రికి అనుమతులే లేవని, అక్కడ వైద్యులు కూడా అందుబాటులో లేరని ఆసుపత్రికి అనుమతులు లేనందువల్ల నిబంధనలకు విరుద్ధంగా ఉన్నందుకు సీజ్ చేసే విధంగా నోటీసులు జారీ చేశామని డిఎంహెచ్ఒ తెలిపారు. అనంతరం ఆసుపత్రిలో విలేకరులతో మాట్లాడుతూ ప్రైవేటు వైద్యశాలలో తనిఖీలు చేశామని, కొన్ని నిబంధనలకు విరుద్ధంగా ఉండటంతో నోటీసులు అందజేశామన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో అన్ని రకాల సేవలను ఎంబిబిఎస్

పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ రాజ్యలక్ష్మి

డాక్టర్ల ద్వారా చేస్తున్నామని, ప్రజలు అర్థం చేసుకొని ప్రభుత్వ ఆసుపత్రికి రావాలన్నారు. రూపాయి ఖర్చు లేకుండా వైద్యం చేస్తున్న ఆసుపత్రులను వదిలేసి.. డాక్టర్ దగ్గర కొన్ని నెలలు పనిచేసి వచ్చి.. ఆర్‌ఎంపీలుగా వ్యవహారం చేస్తున్న వారి దగ్గరికి క్యూలు కడుతున్నారని, ప్రజల్లో మార్పు రావాలని సూచించారు. ఆర్‌ఎంపీ డాక్టర్లు, ల్యాబ్‌ల నిర్వాహకులు పరిధికి మించి వైద్యం చేస్తే నోటీసులు ఇవ్వడంతో పాటు క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆసుపత్రిలో ఉన్న డాక్టర్లందరూ ఆర్‌ఎంపీల దగ్గరకు వెళ్లి చెక్ చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా ఉంటే పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కొందరు వైద్యాన్ని వ్యాపారంగా మార్చుకొని ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని వివరించారు. కార్యక్రమం లో డాక్టర్ చైతన్యకష్ణ, డాక్టర్ వంశీధర్, డాక్టర్ శ్రీధర్, లీనారాఖేల్, ఆరోగ్య పర్యవేక్షకులు మసూద్‌అలీ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈనెల 8వ తేదీన బాపట్ల జిల్లాలో పర్యటించనున్నారని సీఎంఓ నుంచి సమాచారం వచ్చిందని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సమాచారం రావడంతో హెలిప్యాడ్ ప్రాంతం, సీఎం పర్యటించే ప్రాంతాలను జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్ శ్రీధర్, బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి కలిసి గురువారం పరిశీలించారు. తుపానుతో నీట మునిగిన పంటలను రాష్ట్ర ముఖ్యమంత్రి పరిశీలిస్తారని కలెక్టర్ చెప్పారు. బాపట్ల వద్ద తుపాను తీరం దాటడంతో పంటలు అధికంగా దెబ్బతిన్నాయన్నారు. ముఖ్యమంత్రి శుక్రవారం ఉదయం బాపట్లకు చేరుకోనున్న నేపథ్యంలో హెలిప్యాడ్ సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశిం చారు. బాపట్ల జిల్లాలో తుపాను ప్రభావం, అధికార యంత్రాంగం తీసుకున్న సహాయక చర్యలపై ఫోటో ప్రదర్శన నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. నిర్వాసితులైన బాధితులు రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడటానికి ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేయాలన్నారు. వి.ఐ.పి.ల గ్యాలరీ హెలి ప్యాడ్ సమీపంలో ఉండాలన్నారు. కర్లపాలెం మండలం పాత నందాయపాలెం వద్ద నీటిలో ఉన్న మిర్చి పంట, బుద్దాం గ్రామంలో తుంగభద్ర కాల్వ బ్రిడ్జి పక్కనే నీట మునిగిన వరి పంటలను,ముఖ్యమంత్రి పరిశీలించే ప్రాంతాలను ఆయన పరిశీలించారు.మరుప్రోలువారిపాలెం వద్ద జాతీయ రహదారిపై హెలిప్యాడ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆయన సూచించారు. ఆయన వెంట రాష్ట్ర ముఖ్య మంత్రి భద్రతా బందం అధికారులు, బాపట్ల ఆర్డిఓ రవీందర్, జిల్లా అధికారులు ఉన్నారు.

సిఎం పర్యటన ఏర్పాట్లలో భాగంగా రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

సిఎం పర్యటనను విజయవంతం చేయాలి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శుక్రవారం బాపట్ల జిల్లాకు వస్తున్న నేపథ్యంలో పర్యటనను విజయవంతం చేయడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని ఆయన ఛాంబర్ లో ముఖ్యమంత్రి పర్యటన ఖరారైన సందర్భంగా చేయవలసిన ఏర్పాట్ల పై జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సిహెచ్ శ్రీధర్,జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకట రమణ, వ్యవసాయ శాఖ జె.డి అబ్దుల్ సత్తార్, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జున్ రావు, గహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రసాద్, డి.ఎస్.ఓ విలియమ్స్, డి.ఎం శ్రీలక్ష్మీ, డి.పి.ఓ రాంబాబు పాల్గొన్నారు.

ట్రాఫిక్ మళ్ళింపు

రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి శుక్రవారం బాపట్ల జిల్లా పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు తీసుకున్నట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు.ముఖ్యమంత్రి పర్యటన నిమిత్తం శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ట్రాఫిక్ మళ్లించిన మార్గాల వివరాలను ఎస్పీ వెల్లడించారు.

- రేపల్లె , చెరుకుపల్లి వైపు నుండి బాపట్లకు వచ్చే వాహనాలను యాజలి - గుడిపూడి మీదగా బాపట్ల - పొన్నూరు మార్గంలో దారి మళ్ళించారు.
- బాపట్ల నుండి రేపల్లె, చెరుకుపల్లి వైపు వెళ్ళు వాహనాలను గుడిపూడి - యాజలి మీదుగా దారి మళ్ళించారు.
- బాపట్ల లోని హీరో మోటార్ సైకిల్ షో రూమ్ జంక్షన్ నుండి బాపట్ల ఇంజినీరింగ్ కాలేజీ దగ్గరలో ఉన్న జంక్షన్ వరకు హైవే పైకి వాహనాలకు అనుమతి లేదు.
- చీరాల వైపు నుంచి సూర్యలంకకు వచ్చే వాహనాలు బాపట్ల ఇంజినీరింగ్ కాలేజీ దగ్గరలో వున్న జంక్షన్ నుండి బాపట్ల పట్టణం లోకి వచ్చి గడియార స్థంభం సెంటర్ మీదుగా సూర్యలంకకు వెళ్ళాలి.
- సూర్యలంక వైపు నుండి వచ్చే వాహనాలు హైవే పైకి అనుమతి లేదు, వారు బాపట్ల పట్టణం లోని గడియార స్థంభం సెంటర్ నుండి చీరాల (లేదా) గుంటూరు వైపుకు వెళ్ళాలని ఎస్పీ సూచించారు.

నేడు కొత్తపట్నంలో 'స్పందన'

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

స్పందన(జగనన్నకు చెబుదాం) కార్యక్రమం కొత్తపట్నం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 నుంచి 2 గంటల వరకు జరుగుతుందని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. ప్రతి శుక్రవారం మండలంలో స్పందన కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఈ నెల 15న శుక్రవారం ఉదయం 10 నుంచి 2 గంటల వరకు దోర్నాలలో, ఈ నెల 22న శుక్రవారం ఉదయం 10 నుంచి 2 గంటల వరకు వెలిగండ్లలో, ఈ నెల 29న శుక్రవారం ఉదయం 10 నుంచి 2 గంటల వరకు పెద్దారవీడులో స్పందన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఆయా మండలాల్లో జరిగే స్పంద కార్యక్రమాలలో జిల్లా అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

వైద్యరంగంలో ఐసిడి కోడ్స్ కీలకం

ప్రజాశక్తి-ఒంగోలు

వైద్య రంగంలో ప్రపంచవ్యాప్తంగా ఐసిడి కోడ్స్ కీలకం కానున్నాయని, ఐసిడి కోడ్స్‌పై అన్ని విభాగాల, అన్ని స్థాయిలో ఉన్న వైద్యులు, సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని హెల్త్ బురో ఆఫ్ ఇంటెలిజెన్స్ రిసోర్స్ పర్సన్ డాక్టర్ వహీద్ అన్నారు. ఐసిడిపై జిజిహెచ్ లో అవగాహన కల్పించేందుకు హెల్త్ ఇంటెలిజెన్స్ బ్యూరో బెంగళూరు వారి ఆధ్వర్యంలో వర్క్ షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌కు సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ బి.తిరుమలరావు అధ్యక్షత వహించగా జిజిహెచ్ సూపరింటెం డెంట్ డాక్టర్ భగవాన్‌నాయక్ లాంఛనంగా వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ నందీశ్వర, డాక్టర్ ప్రభాకరరావు, డాక్టర్ బాలాజీ నాయక్, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ అనిల్, డాక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మెరుగైన జీవనోపాధికి 'మహిళా శక్తి ఆటో'

మహిళలకు ఆటోలు అందజేసిన కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

స్వయం సహాయక సంఘాలలోని మహిళలు మెరుగైన జీవనోపాధితో మరింత ఆర్థిక స్వావలంబన సాధించేలా 'మహిళా శక్తి ఆటో పథకం' ఎంతగానో ఉపయోగపడుతుందని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. డిఆర్‌డిఏ- వైఎస్ఆర్‌కెపి ఆధ్వర్యంలో జిల్లాలోని 12 మంది ఎస్‌సి, ఎస్‌టి స్వయం సహాయక సంఘ సభ్యులకు ఉన్నతి పథకం ద్వారా వడ్డీ లేకుండా ఈ పథకంలో రూ.35,66,945 విలువైన ఆటోలను గురువారం కలెక్టరేట్‌లో ఆయన అందించారు. అనంతరం జడ్పీ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాతలతో కలిసి జెండా ఊపగా, లబ్ధిదారులు తమ ఆటోలను ర్యాలీగా డ్రైవ్ చేసుకుంటూ వెళ్లారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకంలో లబ్ధిపొందడానికి మహిళలకు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ ఉండడంతో పాటు 18-45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. లబ్ధిదారులు కోరుకున్న ఆటో మోడల్ ఖరీదులో 10 శాతం వాటాను ముందుగా ఎస్‌హెచ్‌జి పొదుపు ఖాతాలో జమ చేయాల్సి ఉంటుందన్నారు. లబ్ధిదారుల పేర ఆటో రిజిస్ట్రేషన్, ఆటోకు, లబ్ధిదారునికి తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధుల నుండి వడ్డీ లేని రుణంగా ఈ అప్పు ఇస్తామని, వీటిని 48 నెలల పాటు వాయిదాల పద్ధతిలో చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుత లబ్ధిదారులలో 9 మంది ఎస్‌సిలు, ముగ్గురు ఎస్‌టిలు ఉన్నట్లు ఆయన తెలిపారు. వీరికి మంజూరు చేసిన ఒక్కో ఆటో ఖరీదు మోడల్‌ను బట్టి కనిష్ఠంగా రూ.2.53,000 ల నుంచి గరిష్ఠంగా రూ.3,35,000 వరకు ఉన్నట్లు తెలిపారు. డ్రైవింగ్ వచ్చిన, లైసెన్స్ కలిగిన మహిళలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. మహిళలు ఏ రంగంలోనూ తీసిపోరని, ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని సూచించారు. జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు ముఖ్యంగా మహిళలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్ని విధాలా అండగా ఉంటున్నారన్నారు. ఈ దిశగా అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, డిఆర్‌డిఏ పీడీ టి.రవికుమార్ డిటిసి ఆర్. సుశీల, డిపిఎంలు, ఎపిఎంలు బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

సాయుధ పతాక నిధికి విరాళాలివ్వండి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

దేశం కోసం ప్రాణాలు అర్పించిన సైనికుల కుటుంబాలకు అండగా ఉండేందుకు సాయుధ దళాల పతాక నిధికి విరివిగా విరాళాలు ఇవ్వాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భ కలెక్టర్ తొలి విరాళాన్ని అందించారు. జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, జిల్లా అధికారులు కూడా వారి విరాళాలను అందజేశారు. గత సంవత్సరం అధిక విరాళం అందచేసిన జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం, ఆర్ఐఒ ఏ.సైమన్ విక్టర్, ఎపి టిడ్కో ఈఈ, భగీరద కెమికల్స్, జిల్లాలోని -3- అసోసియేషన్లు, అత్యుత్తమ సేవలు అందించిన 9 మంది మాజీ సైనికులు, ఎన్‌సిసి సిబ్బందికి కలెక్టర్ అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి ఎం.రజని పాల్గొన్నారు.